ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్
సంప్రదించండి
9010972526

గురువారం | 10-09- 2026 సంపుటి: 17, సంచిక: 159, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

## ఫాంహౌస్‌లో కుట్రపై

# సమగ్ర విచారణ

### కేసీఆర్ ఆధ్వర్యంలో పన్నిన కుట్రలో భాగంగానే.. అధికారులపై బీఆర్ఎస్ సభ్యుల దాడులు



- ఉన్మాదంతో వ్యవహరించిన బీఆర్ఎస్ సభ్యులు
- దళితులు తిరిగిన నేలను శుద్ధి చేస్తారా?
- ఫాంహౌస్ కుట్రలపై దర్యాప్తుకు ఆదేశిస్తున్నాం
- జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌కు బాధ్యతలు
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ప్రజాకలం) :
శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చించాలనుకున్న ప్రభుత్వ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కుట్ర జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఆధ్వర్యంలో పన్నిన కుట్రలో భాగంగానే.. బీఆర్ఎస్ సభ్యులు అధికారులపై దాడులు చేయడంతోపాటు శాసనసభ స్పీకర్‌ను, ఆయన తల్లిని అవమానపరిచారని తెలిపారు. సభాపతికి జరిగిన అవమానంపై డప్పు దరువు ద్వారా నిరసన తెలిపేందుకు వెళ్లిన దళిత సంఘాల ప్రతినిధులు, ప్రజాస్వామికవాదులపైనా దాడులు చేశారని మండిపడ్డారు. పైగా, దళితులు తిరిగిన నేలను శుద్ధి చేసి.. తీవ్రమైన నేరానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వరుస ఘటనలు చూస్తుంటే పథకం ప్రకారమే జరిగినట్లు కనిపిస్తోందన్నారు. ఈ అన్ని ఘటనలపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయని, ఈ కేసుల దర్యాప్తు బాధ్యతలను హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయకుమార్‌కు అప్పగిస్తున్నామని చెప్పారు. బుధవారం స్పీకర్‌పై బీఆర్ఎస్ సభ్యుల దూషణలపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అంటే దేశంలో కోట్లాది మంది ప్రజలకు, తాడిత, పీడిత వర్గాలకు ఒక విశ్వాసం, భరోసా అని అన్నారు. వివిధ సమూహాల కలయిక అయిన భారతదేశంలో దళితులు, మహిళలు, ఆదివాసీల గౌరవాన్ని నిలబెట్టేలా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఆధారంగా నడుస్తున్న ప్రజాస్వామ్య వ్యవస్థ మనదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏం చేసిందని అడిగేవారు.. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లో పరిస్థితులను ఒకసారి పరిశీలించాలని సీఎం రేవంత్ అన్నారు. భారతదేశం అభివృద్ధి చెందేలా కాంగ్రెస్ దూరదృష్టితో ఎలాంటి చర్యలు తీసుకుందో వారికి అర్థమవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. ఆ రిజర్వేషన్ల ద్వారా రాష్ట్రపతి వరకు అవకాశం దక్కిందన్నారు.

తరువాయి 2వ పేజీలో...




## వి.ఆర్. విద్యార్థి వంటి కవులు, రచయితలు

## కాళోజీ వారసత్వాన్ని

# పుణికిపుచ్చుకోవాలి

- మంత్రి జూపల్లి : రవీంద్రభారతిలో ఘనంగా కాళోజీ జయంతి ఉత్సవాలు
- వి.ఆర్. విద్యార్థికి కాళోజీ సాహిత్య పురస్కార ప్రదానం

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ప్రజాకలం) :
కాళోజీ నారాయణరావు ప్రజల గొంతుకగా, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైనిక కవిగా, ఖండాంతర కవిగా ప్రసిద్ధి చెందిన వి.ఆర్. విద్యార్థికి (వేలూరి రాములు) 2026 కాళోజీ నారాయణరావు సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. వి.ఆర్. విద్యార్థిని మంత్రి జూపల్లి కృష్ణారావు హృదయపూర్వకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. కాళోజీ నారాయణరావు సాహిత్య వారసత్వాన్ని వి.ఆర్. విద్యార్థి వంటి వారు పుణికిపుచ్చుకుని ముందుకు తీసుకెళ్లాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ ప్రజల జీవితం, బాధ, ఆశ, ఆకాంక్ష, పోరాటం, ఆత్మగౌరవం కాళోజీ రచనల్లో స్పష్టంగా ప్రతిబింబించాయని పేర్కొన్నారు.
కాళోజీ రచించిన 'నా గొడవ' కేవలం ఆయన వ్యక్తిగత గొడవ కాదని మంత్రి అన్నారు.

తరువాయి 2వ పేజీలో...

# ఎర్రకోటే లక్ష్యం




ఏళ్ల ముందే రెక్కీ.. ఎన్ఐఏ ఛార్జిషీట్‌లో కీలక వివరాలు

## కలం కౌంటర్




## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలది

# 'కీచక పర్వం'

## సీతక్క వీడియో విడుదల

- మహిళా ఎమ్మెల్యే పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలది కీలక పర్వం
- అసెంబ్లీ వద్ద ఘటనపై మంత్రి సీతక్క వీడియో విడుదల



హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ప్రజాకలం) :
తెలంగాణ వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు మూడో కొనసాగుతున్నాయి. శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు. కాగా, తెలంగాణ అసెంబ్లీ ఘటనపై మంత్రి సీతక్క వీడియో విడుదల చేశారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దుర్మార్గంగా వ్యవహరించారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించారని పేర్కొన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## కాంగ్రెస్ ప్రభుత్వంపై గవర్నర్‌కు

# బీఆర్ఎస్ ఫిర్యాదు

### ప్రజలకే కాదు.. ప్రజా ప్రతినిధులకూ అవమానాలే

హామీలు అమలు కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు
మేం చేసిన నేరం ఏంటి?: కేటీఆర్
అరచేతిలో స్వర్గం చూపి.. ప్రజలను మోసం చేశారు!



హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ప్రజాకలం) :
తెలంగాణ ప్రస్తుత గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లాతో బీఆర్ఎస్ సభ్యుల సమావేశం ముగిసింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరును నిరసిస్తూ గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను గవర్నర్‌కు వివరంగా తెలిపామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని

తరువాయి 2వ పేజీలో...



## రైల్వే మౌలిక వసతుల విస్తరణకు

# గ్రీన్‌సిగ్నల్

### రైల్వే మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

### రైల్వేలో అత్యంత రద్దీగా ఉండే ఏడు హైడెన్సిటీ కారిడార్లను నాలుగు లైన్లుగా విస్తరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 :దేశంలో రైల్వే మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైల్వేలో అత్యంత రద్దీగా ఉండే ఏడు హైడెన్సిటీ కారిడార్లను నాలుగు లైన్లుగా విస్తరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సుమారు రూ.11 వేల కోట్ల విలువైన మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్‌గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కేంద్రం తాజా నిర్ణయంతో ఢిల్లీ-హౌరా, హౌరా-ముంబై, ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-గువాహటి, ఢిల్లీ-చెన్నై, హౌరా-చెన్నై, ముంబై-చెన్నై మార్గాల్లో ప్రస్తుతం ఉన్న రైల్వే నెట్‌వర్క్‌ను నాలుగు లైన్లకు పెంచనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశంలోని అనేక ప్రధాన నగరాలకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా ఐదు రాష్ట్రాల్లోని

తరువాయి 2వ పేజీలో...



## ఫాంహౌస్‌లో కుట్రపై
# సమగ్ర విచారణ

మొదటి పేజీ తరువాయి...

కర్ణాటకలోని ఒక చిన్న గ్రామంలో జన్మించి.. రజాకార్ల దాడుల్లో తండ్రిని కోల్పోయి, కార్మిక నాయకుడిగా రాణించి, జాతీయ స్థాయికి ఎదిగిన నేత మల్లికార్జున ఖర్గే 60 ఏళ్లుగా ప్రజల కోసం పనిచేస్తున్నారని చెప్పారు. 85 ఏళ్ల వయసులోనూ ఈ దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలపై పోరాడుతున్న ఖర్గే.. ఉత్తరాఖండ్‌లో ఒక నిరసన సభలో పాల్గొంటే.. బీజేపీ అనుబంధ సంస్థ అయిన శ్రీరామ్‌సేన సభ్యులు ఆ మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టడం అత్యంత హేయమైన చర్య అని రేవంత్ మండిపడ్డారు. దీనిని శాసనసభ ముక్తకంఠంతో ఖండిస్తోందని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై దేశమంతటా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతోపాటు ఎంపీలు రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ ఘటనను మరువక ముందే రాష్ట్రంలో మరో దురదృష్టకర సంఘటన జరిగిందన్నారు.

**సభ నడవకుండా బీఆర్ఎస్ కుట్ర..**

విద్యా రంగంలో సమస్యలు, ధరణి అక్రమాలు, 22ఏ రాద్ధాంతంపై శాసనసభలో చర్చించాలనుకున్నామని, ప్రతిపక్షాలు లేవనెత్తిన చాలా అంశాలపై చర్చించాలని నిర్ణయించామని సీఎం రేవంత్ అన్నారు. కానీ, ఇవేవీ జరగకుండా బీఆర్ఎస్ కుట్ర చేసిందని ఆరోపించారు. ఈ నెల 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతుంటే.. 6వ తేదీ సాయంత్రం ఆ పార్టీ సభ్యులను కేసీఆర్ తన ఫాంహౌస్‌కు పిలిపించుకొని.. సభ జరగకుండా చేసేలా పథకం పన్నారని తెలిపారు. వారి సభ్యులను ఉన్మాదులుగా మార్చి.. సభను అడ్డుకునేందుకు ఉసిగొల్పారని చెప్పారు. సమస్యలపై చర్చ జరిగితే వారి పదేళ్ల దురాగతాలు, అప్పులపై ప్రజలకు అవగాహన కలుగుతుందని భయపడ్డారని, అదే జరిగితే తెలంగాణ ప్రజలు ఇక శాశ్వతంగా వారి పార్టీని బొందపెడతారనే చర్చ జరగకుండా కుట్ర చేశారని ధ్వజమెత్తారు. పార్లమెంటుపై దాడి చేసిన ఉగ్రవాదులకు, ఉన్మాదంతో సభాపతిని అవమానించిన వారికి పెద్దగా తేడా లేదన్నారు. ఉన్మాదానికి లోనై కొంతమంది నేతలు.. అధికారులపై దాడులు చేయడమే కాకుండా సభాపతిని అవమానించేలా వ్యవహరించారని, ఆయన తల్లిని సైతం అవమానించారని మండిపడ్డారు. రాజకీయాల్లో విభేదాలు ఉండవచ్చునని, కానీ.. వ్యక్తపరచడంలో విచక్షణ కోల్పోయి ప్రవర్తించారని తెలిపారు. దీనిపై విపక్ష నేత కేసీఆర్ సభాపతికి క్షమాపణచెప్పి.. వారి సభ్యులతో క్షమాపణ చెప్పించి.. సభ సజావుగా జరిగేలా చూస్తారని అంతా భావించారని, కానీ.. అలా జరగకపోగా వారు మరింత ఉన్మాదంతో వ్యవహరించారని విమర్శించారు.

**దళితులు నిరసన తెలపడం నేరమా?**

కుట్ర జరిగిన ఫాంహౌస్ ముందే దండోరా వేయాలని ప్రజాస్వామ్యవాదులు నిరసనకు దిగారని సీఎం రేవంత్ తెలిపారు. వారిలా ఉన్మాదానికి తెగబడలేదని, కేవలం డప్పు దరువులతో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపారని చెప్పారు. తమను బానిసలుగా భావించవద్దని, సహనం కోల్పోయేలా వ్యవహరించవద్దని చెప్పేందుకే దళిత సోదరులు వెళ్లారన్నారు. చెప్పులు కుట్టిన చేతులు రాజ్యాంగ పదవులను చేపట్టాయని, ఇంకా తమ మనసులను గాయపరచవద్దని దరువేసి మరీ చెప్పారన్నారు. ఇది నేరమెలా అవుతుందని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్.. బాధలో ఉన్నవారి సమస్యను పరిష్కరించే బాధ్యత తీసుకోవాల్సిందని, ఆ ప్రతినిధులను లోపలికి పిలిచి మాట్లాడి ఉండాల్సిందని అన్నారు. కానీ, ఆయన అలా వ్యవహరించకుండా మళ్లీ ఉన్మాదంతో వ్యవహరించారని తెలిపారు. దళితులు తిరిగిన నేలను శుద్ధి చేయాలంటూ ఆదేశించి తీవ్రంగా అవమానించారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఆదేశాలతోనే అక్కడ శుద్ధి చేశామంటూ సంధ్యారావు అనే బీఆర్ఎస్ నాయకురాలు స్వయంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారని చెప్పారు. ఇదంతా చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? రాతియుగంలోని రాక్షసుల్లా వ్యవహరిస్తున్నామా? అనే సందేహం కలుగుతోందన్నారు.

**సమాజంలో అశాంతి సృష్టించాలనుకున్నారు..**

సమాజంలో జాతి, కుల వివక్ష తీసుకొచ్చి.. అశాంతిని ప్రోత్సహించి.. రెండు జాతుల మధ్య వైరంగా మార్చాలని కేసీఆర్ అనుకుంటున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. ఇందుకు ఆ కుటుంబాన్ని సామాజిక బహిష్కరణ చేయాలన్నారు. అప్పుడే ఈ వివక్ష ఫలితం ఎలా ఉంటుందో వారికి అర్థమవుతుందన్నారు. అధికార మదంతో కొల్లగొట్టిన ఆస్తులతో, ఆధిపత్యం చెలాయించాలనేది వారి ఆలోచన అని ఆరోపించారు. దళితుడు అడుగుపెడితే నేల మైలపడుతుందని కేసీఆర్ అవమానిస్తే.. ఈ సమాజమే మైల పడుతుందన్నారు. దళితుడు దుక్కి దున్ని పంట పండిస్తేనే మన కడుపులు నిండుతున్నాయన్నారు. శుద్ధి చేయాల్సింది దళితులు నడిచిన నేలను కాదని, కేసీఆర్ కుటుంబంలో పాతుకుపోయిన అహంకారాన్ని, అంటరానితనం ఆలోచనల్ని అని చెప్పారు. కేసీఆర్ మనసులో పేరుకుపోయిన దొర అహంకారాన్ని శుద్ధి చేసే బాధ్యతను తెలంగాణ సమాజం తీసుకుంటుందన్నారు. సభాపతిని అవమానించిన వారిని చట్టపరంగా శిక్షించేలా ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరిస్తోందని, జరిగిన తప్పును ఒప్పుకొని క్షమాపణ చెబితే కిరీటం ఊడి పడుతుందా? అని ప్రశ్నించారు. ఇంకా కొంతమంది మనసుల్లో పేరుకుపోయిన మనువాద భావాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం విచారణ చేపట్టి ఎంతటివారినైనా శిక్షించాలని నిర్ణయించిందని సీఎం ప్రకటించారు. కుట్రలు పన్నినవారితోపాటు కుట్రలో భాగస్వాములైన వారినీ చట్టపరిధిలోశిక్షించాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు.

**అన్ని ఘటనలపైనా దర్యాప్తు..** ఈ నెల 6న జరిగిన కుట్ర నుంచి ఆ తర్వాత జరిగిన వరుస ఘటనలను క్రోడీకరించి.. సమగ్ర విచారణ జరిపి, క్రిమినల్ కేసులు పెట్టి శిక్షించాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం తెలిపారు. సభాపతి మానసిక ధైర్యం కోల్పోవద్దని, ఆయన మనసును గాయపరిచిన వారిని వదిలే ప్రసక్తి లేదని ప్రకటించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడులు, మహిళా పోలీసులతో అసభ్య ప్రవర్తనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. చట్టాలు, సెక్షన్లను అడ్డుపెట్టుకుని కొంతమంది బెయిల్ పొందవచ్చునని, కానీ.. తెలంగాణ సమాజం మాత్రం వారికి బెయిల్ ఇవ్వదని అన్నారు.

## వి.ఆర్. విద్యార్థి వంటి కవులు, రచయితలు కాళోజీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలి

మొదటి పేజీ తరువాయి...

సమాజంలోని అణగారిన, బాధిత, సామాన్య ప్రజల గొడవను తన గొడవగా కాళోజీ స్వీకరించారని చెప్పారు. ప్రజల సమస్యలను తన కలంతో వినిపించిన ప్రజాకవిగా కాళోజీ చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.

**తెలంగాణ యాస.. కాళోజీ శ్వాస**

తెలంగాణ భాష, యాసపై కాళోజీకి ఉన్న ప్రగాఢ విశ్వాసం ఆయన రచనల్లో స్పష్టంగా కనిపిస్తుందని మంత్రి అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ప్రథమ మహాసభలో తెలంగాణ బతుకు, భాషపై కాళోజీ చేసిన అధ్యక్షోపన్యాసం తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్రలో సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు.

ప్రజలు మాట్లాడే భాషలోనే రచనలు చేయాలని కాళోజీ బలంగా విశ్వసించారని చెప్పారు. 'అవతలి వారికి అర్థమవుతుందా?' అని ముందే ఆలోచించడం ద్వారా మనల్ని మనమే తక్కువ చేసుకోవద్దని, ఈ బానిస భావన పోవాలని కాళోజీ చెప్పిన మాటలు తెలంగాణ భాషపై ఆయనకున్న ఆత్మవిశ్వాసానికి నిదర్శనమన్నారు.

**పలుకుబడుల భాషకు పెద్దపీట**

కాళోజీ దృష్టిలో భాషకు రెండు తీర్లు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఒకటి బడిపలుకుల భాష, మరొకటి పలుకుబడుల భాష అని వివరించారు. పుస్తకాల్లో, పండితుల రచనల్లో కనిపించే భాష కంటే ప్రజల నాలుకలపై సహజంగా నడయాడే పలుకుబడుల భాషలోనే నిజమైన జీవన వాస్తవికత ఉంటుందని కాళోజీ విశ్వసించారని చెప్పారు.

తన పోరాటాలన్నింటికీ కాళోజీ కవిత్వాన్ని మాధ్యమంగా ఎంచుకున్నారని, చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, సరళంగా ప్రజల భాషలోనే చెప్పేవారని మంత్రి పేర్కొన్నారు. అందుకే ఆయన రచనలు సామాన్య ప్రజలకు మరింత చేరువయ్యాయని అన్నారు.

తెలంగాణ యాసను, భాషను, ప్రజల పలుకుబడిని కాళోజీ సాహిత్యంలో గౌరవప్రదంగా నిలబెట్టారని జూపల్లి అన్నారు. ప్రజలు మాట్లాడే భాషే ప్రజల హృదయ భాష అని తన రచనల ద్వారా నిరూపించారని పేర్కొన్నారు. తెలంగాణ మాండలికాన్ని తక్కువగా చూసే ధోరణులకు తన కలంతో సమాధానం చెప్పి, తెలంగాణ యాస పట్ల తనకున్న ప్రగాఢ విశ్వాసాన్ని చాటుకున్నారని వెల్లడించారు.

భాష కేవలం సంభాషణకు ఉపయోగించే సాధనం మాత్రమే కాదని, ఒక జాతి చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, ఆత్మగౌరవానికి ప్రతిబింబమని మంత్రి పేర్కొన్నారు. కాళోజీ అందించిన స్ఫూర్తిని కొనసాగించాలనే ఉద్దేశంతోనే ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే మౌలిక వసతుల విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

మొదటి పేజీ తరువాయి...

14 జిల్లాలకు లబ్ధి చేకూరనుంది. దాదాపు 4,790 గ్రామాలకు రైలు కనెక్టివిటీ, రవాణా సామర్థ్యం పెరగనుంది. అలాగే సుమారు 56 లక్షల మంది ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం కలగనుంది. కాగా, ఢిల్లీ–హౌరా మార్గంలో కాన్పూర్, ప్రయాగ్‌రాజ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్, పాట్నా, ఆసన్‌సోల్ వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. ఢిల్లీ–ముంబై మార్గం మథుర, కోటా, రత్లాం, వడోదర, సూరత్‌లను కలుపుతుంది. ఢిల్లీ–చెన్నై మార్గంలో ఆగ్రా, గ్వాలియర్, ఝాన్సీ, భోపాల్, నాగ్‌పూర్, విజయవాడ వంటి నగరాలు ఉన్నాయి. అలాగే ముంబై–చెన్నై మార్గం పుణె సహా పలు ముఖ్యమైన ప్రాంతాలను కలుపుతుంది. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గాల్లో ఇకపై రైళ్ల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గనున్నాయి. అదనపు రైల్వే లైన్లు అందుబాటులోకి వస్తే ప్రస్తుతం ఉన్న మార్గాల్లో రైళ్ల సంఖ్యను పెంచేందుకు అవకాశం ఏర్పడుతుంది. దీంతో ప్రయాణికుల రైళ్లతోపాటు సరకు రవాణా రైళ్లనూ మరింత సమర్థమంతంగా నడిపేందుకు వీలు కలుగుతుంది. ముఖ్యంగా ఈ మార్గాలు బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు తదితర కీలక వస్తువుల రవాణాకు అత్యంత కీలకమైనవి. మల్టీట్రాకింగ్ పనులు పూర్తయితే అదనంగా ఏడాదికి 27 మిలియన్ టన్నుల మేర సరకు రవాణా సామర్థ్యం పెరగనుంది. ఈ సందర్భంగా రైల్వే మౌలిక వసతుల విస్తరణపై కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 12 ఏళ్లుగా రైల్వే ఆధునికీకరణ, మౌలిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉన్న ఏడు ప్రధాన రైల్వే కారిడార్లను నాలుగు లైన్లుగా విస్తరించడంతోపాటు భవిష్యత్తులో అధిక రవాణా అవసరం ఉన్న మరిన్ని మార్గాల అభివృద్ధిపైనా దృష్టి సారిస్తున్నామని ఆయన చెప్పారు.

**తెలుగు రాష్ట్రాలకు లబ్ధి..**

కేంద్ర కేబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ నిర్ణయంతో తెలుగు రాష్ట్రాలకు లబ్ధి చేకూరనుంది. హౌరా–చెన్నై కారిడార్‌లో భాగంగా విశాఖ, విజయవాడ మీదుగా నాలుగు లైన్ల నిర్మాణం జరగనుంది. ముంబై–చెన్నై రైల్వే కారిడార్‌లో భాగంగా గుంతకల్లు, రేణిగుంట మీదుగా నాలుగు లైన్లు రానున్నాయి. అలాగే ఘట్‌కేసర్– కాజీపేట పరిధిలో నాలుగో లైన్‌ను రూ.2,418 కోట్లతో 110 కి.మీ. మేర నిర్మించనున్నారు. మరోవైపు, అరక్కోణం–రేణిగుంట సెక్షన్‌లోనూ మూడేళ్లలో 3, 4 లైన్ల నిర్మాణానికి సీసీఈఏ ఆమోదం తెలిపింది.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలది 'కీచక పర్వం'

మొదటి పేజీ తరువాయి...

సబిత, సునీత, కోవా లక్ష్మిని గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి తోశారని వివరించారు. మహిళా ఎమ్మెల్యేలను నెట్టుకుంటూ గంగుల ముందుకు వచ్చారని తెలిపారు. ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలమధ్యలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే తాకుకుంటూ వచ్చారన్నారు.

మహిళా ఎమ్మెల్యేల మధ్యకు చొరబడాల్సిన అవసరం సుధీర్ రెడ్డికి ఏముంది? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే.. మహిళా ఎమ్మెల్యేల మీద పడ్డారని సూచించారు. కోవా లక్ష్మి, సబితా మీద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చెయ్యి వేశారని ఆరోపించారు.

నవీన్ రెడ్డి నెడుతూ వెళ్లినప్పుడు మహిళా ఎమ్మెల్యే అరిచారని చెప్పారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచిత, అసభ్య ప్రవర్తన అన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలది కీచక పర్వమని సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి...

అరచేతిలో స్వర్గం చూపారని ఆరోపించారు. అన్ని వర్గాలకు డిక్లరేషన్లు, బాండ్ పేపర్లు, అఫిడవిట్ల పేరిట 420 హామీలిచ్చారని గుర్తుచేశారు. ప్రజలకు హామీలు గుప్పించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం లోకి వచ్చి వెయ్యి రోజులైన హామీలు అమలు చేయలేదని గవర్నర్ కు తెలిపామని వెల్లడించామన్నారు. రైతు బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో నిరుద్యోగులను ఏ విధంగా మోసం చేశారో వివరించామని తెలిపారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు పార్లమెంట్ కు రాహుల్ గాంధీ వెళ్లినట్లే తాము నల్ల టీషర్టులు వేసుకుని అసెంబ్లీకి వెళ్లామన్నారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్ కు ఆధారాలు చూపామన్నారు. సబితా ఇంద్రారెడ్డిపై పోలీసుల దాడి, అవమానంపై, సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై గవర్నర్ కు ఆధారాలు సమర్పించామని స్పష్టం చేశారు. తమపై దాడులు చేసి తమపైనే కేసులు పెట్టారని వివరించినట్లు పేర్కొన్నారు. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# ఎర్రకోటే లక్ష్యం

## ఏళ్ల ముందే రెక్కీ.. ఎన్ఐఏ ఛార్జిషీట్‌లో కీలక వివరాలు




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 : ఢిల్లీలోని ఎర్రకోట వద్ద గతేడాది నవంబర్ 10న జరిగిన బాంబు పేలుడు.. ఆత్మాహుతి దాడేనని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) స్పష్టం చేసింది. నిందితుడు ఉమర్ ఉన్ నబీ కారులో ఉండగానే పేలుడు పరికరాన్ని(ఐఈడీ) యాక్టివేట్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. దాడి వెనుక ఉన్నట్లు ఆరోపిస్తున్న కుట్ర, నిందితుల కదలికలు, వారికి లభించిన సిద్ధాంత, కార్యాచరణపరమైన సమాచారాన్ని ఎన్ఐఏ ప్రస్తావించింది. ఈ కేసును అన్సార్ గజ్వత్–ఉల్–హింద్(ఏజీయూహెచ్) మాడ్యూల్‌తో సంబంధం ఉన్నట్టుగా తేల్చింది. ఎన్ఐఏ తెలిపిన ప్రకారం.. పేలుడు జరిగిన సమయంలో ఉమర్ ఉన్ నబీ కారులోనే ఉన్నాడని తేలింది. అతడే నిర్దిష్ట కమాండ్ ద్వారా ఐఈడీని ప్రారంభించినట్టు తెలుస్తోంది. దీంతో ఇది ఆత్మాహుతి దాడేనని నిర్ధారించినట్లు తెలిపింది. ఎర్రకోటను లక్ష్యంగా చేసుకోవాలనే ఆలోచన అప్పటికప్పుడు వచ్చినది కాదని కూడా ఎన్ఐఏ పేర్కొంది. 2023 డిసెంబరు నుంచే నిందితులు పలుమార్లు ఆ పరిసరాలను పరిశీలించినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు స్పష్టం చేసింది. ఉమర్ ఇతర నిందితులతో కలిసి పలుమార్లు అక్కడికి వెళ్లినట్లు పేర్కొంది. అయితే.. దాడికి ముందుగా నిర్దిష్ట తేదీని నిర్ణయించలేదన్న ఎన్ఐఏ.. ఆ సమూహంలోని కొందరు శ్రీనగర్‌లో అరెస్ట్ అయ్యారనే భయంతో దాడిని వేగవంతం చేశాడని ఆరోపించింది. నిందితులు తీవ్రవాద భావజాల సంబంధిత కార్యకలాపాలకు ప్రభావితమయ్యారని కూడా ఎన్ఐఏ పేర్కొంది. ఇందుకోసం 'లోన్ ముజాహిద్ పాకెట్ బుక్/హౌ టూ బికమ్ యాన్ అసాసిన్' పేరిట ఉన్న ఓ డాక్యుమెంట్‌ను కూడా ప్రస్తావించింది. పేలుడు పదార్థాలు, ఆయుధాలు, రహస్య కార్యకలాపాలు, ఐఈడీలకు సంబంధించిన అంశాలు అందులో ఉన్నట్లు తెలిపింది. అలాగే ప్రజాస్వామ్య వ్యవస్థలను హింసాత్మకంగా కూల్చేయాలని ప్రోత్సహించే భావజాలం కూడా అందులో ఉన్నట్లు ఆరోపించింది ఎన్ఐఏ. డెమోక్రసీని రిజెక్ట్ చేసి, షరియా పాలనను కోరుతూ రాసిన హ్యాండ్‌రైటింగ్ నోట్స్ కూడా అల్–ఫలాహ్ ఫ్లాట్‌లో లభ్యమైనట్లు తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. భారత రాజ్యానికి ప్రతీకగా భావించే ఎర్రకోటను లక్ష్యంగా చేసుకున్నట్టు ఎన్ఐఏ వివరించింది. నిందితుల వద్ద లభించిన డాక్యుమెంట్స్ తీవ్రవాద భావజాలానికి సంబంధించినవే కాకుండా.. రహస్య కార్యకలాపాలను నిర్వహించే విధానం, ఐడెంటిటీలను మార్చడం, ఆధారాలు దొరక్కుండా తప్పించుకునే విధానం వంటి అంశాలెన్నో ఉన్నాయని తెలిపింది.

# ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్

## రైతాంగ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని దీనిని కొనసాగిస్తాం

### శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి తుమ్మల సమాధానం

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ప్రజాకలం) :

యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు పారదర్శకంగా, అవసరమైన మేరకు అందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. యాప్ అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, భవిష్యత్‌లో రైతులకు మరింత సులభంగా, సమర్థవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు యూరియా సరఫరా, యాప్ ద్వారా బుకింగ్, కౌలు రైతుల ఇబ్బందులు, సొసైటీలకు యూరియా రవాణా చార్జీలు, సాంకేతిక సమస్యలు తదితర అంశాలను ప్రస్తావించారు. వాటిపై మంత్రి సమగ్రంగా వివరణ ఇచ్చారు.

**నిజమైన రైతులకే సబ్సిడీ ఎరువులు అందేలా యాప్..**

గతంలో ఆధార్ ఆధారంగా ఎరువుల పంపిణీ జరిగేదని మంత్రి తెలిపారు. అయితే సబ్సిడీపై లభించే ఎరువులు భూమిని వాస్తవంగా సాగు చేస్తున్న రైతులకే అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఎరువుల అక్రమ తరలింపు, బ్లాక్‌మార్కెటింగ్, అవసరానికి మించి నిల్వ చేసుకోవడం వంటి సమస్యలను అరికట్టడంతో పాటు, రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందేలా చేయడమే యాప్ తీసుకురావడానికి ప్రధాన ఉద్దేశమని వివరించారు. పారదర్శకంగా, అవసరమైన మేరకు సబ్సిడీ యూరియా నిజమైన రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రబీ 2025–26లో 'యూరియా బుకింగ్ యాప్'ను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణలో అమలు చేసిన ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో దీని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడానికి 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్'ను ప్రవేశపెట్టిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం 04.06.2026న ప్రవేశపెట్టిన ఖీఖీ యాప్‌ను తెలంగాణలో సెప్టెంబర్ 2, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన యూరియా యాప్ స్థానంలో ప్రస్తుతం FFS యాప్ ద్వారా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

**యాప్‌లో వచ్చిన సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం..**



కొత్త యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సమయంలో అక్కడక్కడా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమేనని మంత్రి అన్నారు. అయితే అవి వ్యవస్థలో శాశ్వతమైన లోపాలు కావని, సాంకేతిక కారణాలతో ఏర్పడిన సమస్యలని తెలిపారు. భారత ప్రభుత్వం నియమించిన సాంకేతిక బృందం మరియు మా అధికారులు యాప్ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. రాబోయే పంట కాలాల్లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందించేందుకు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు.

**స్మార్ట్‌ఫోన్ లేని రైతులకూ బుకింగ్ సౌకర్యం...**

స్మార్ట్‌ఫోన్లు లేని రైతులు కూడా ఎరువుల బుకింగ్ చేసుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా రైతులు ఎరువులు బుక్ చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు, రిటైల్ ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద ఉన్న వాలంటీర్ల సహకారంతో రైతులకు బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రైతు గుర్తింపు, ఖ్యూ వెరిఫికేషన్‌కు లోబడి ఈ సహాయం అందిస్తారని చెప్పారు. FFS యాప్ ద్వారా రైతులు సులభంగా ఎరువులు బుక్ చేసుకునేలా 'మీ–సేవ' బుకింగ్‌లను కూడా అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు లేదా స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తెస్తోందన్నారు.

**డిజిటల్, భౌతిక స్టాక్‌ల మధ్య తాత్కాలిక వ్యత్యాసాలు...**

గిడ్డంగుల నుంచి రిటైల్ విక్రయ కేంద్రాలకు ఎరువులను తరలించడానికి పట్టే సమయం, రసీదుల లెక్కింపు, స్టాక్ బదిలీ నమోదులు, వ-ఖ్యూ సింక్రొనైజేషన్, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి కారణాలతో కొన్ని సందర్భాల్లో డిజిటల్ స్టాక్, భౌతిక స్టాక్ మధ్య తాత్కాలిక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని మంత్రి వివరించారు. ఈ సమస్యలను అధిగమించేందుకు జిల్లాల వారీగా స్టాక్ తనిఖీలు నిర్వహించాలని, డిజిటల్ రికార్డులు మరియు భౌతిక నిల్వలను క్రమం తప్పకుండా సరిపోల్చాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

**గరిష్ట లోడ్‌ను తట్టుకునేలా సర్వర్ సామర్థ్యం పెంపు...**

రాబోయే పంట కాలాల్లో రైతుల సంఖ్య పెరిగినా, ఒకేసారి పెద్ద సంఖ్యలో రైతులు యాప్‌ను వినియోగించినా ఎలాంటి సాంకేతిక అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఖీఖీ యాప్ సాంకేతిక బృందం ఎప్పటికప్పుడు లోడ్ టెస్టింగ్ నిర్వహిస్తోందని, అవసరానికి అనుగుణంగా సర్వర్ సామర్థ్యాన్ని ఆటోమేటిక్‌గా పెంచుకునే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. గరిష్ట వినియోగ సమయంలో కూడా రైతులకు సేవలు అందేలా సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

**యాప్‌ను రద్దు చేయాలని సభ్యుల విజ్ఞప్తి..**

అనంతరం పలువురు సభ్యులు యూరియా రైతులకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండటం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. కౌలు రైతులు యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు, సాంకేతిక ఇబ్బందుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో యాప్‌ను రద్దు చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, బ్లాక్‌మార్కెటింగ్‌ను అరికట్టడం, నిజమైన రైతులకు సబ్సిడీ ఎరువులు అందించడం కోసం తీసుకొచ్చిన ఈ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. యాప్ ద్వారా ఇప్పటికే 50 లక్షలకు పైగా రైతులు ఎరువులు కొనుగోలు చేశారని మంత్రి వెల్లడించారు. ఇంత పెద్ద సంఖ్యలో రైతులు ఈ వ్యవస్థను వినియోగిస్తున్న నేపథ్యంలో, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి వ్యవస్థను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. యూరియా పంపిణీలో పారదర్శకత కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌ను ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువులను యాప్ ద్వారా విక్రయించే విధంగా ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి తుమ్మల తెలిపారు.

# మెట్‌పల్లిలో ఇంటింటికీ మొక్కల పంపిణీ ప్రారంభం

- మెట్‌పల్లిలో ఘనంగా వన మహోత్సవం
- ఒకటో వార్డులో ఇంటింటికీ మొక్కల పంపిణీ ప్రారంభం




మెట్‌పల్లి టౌన్ సెప్టెంబర్ 9(ప్రజా కలం): పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణాన్ని హరితమయంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మెట్‌పల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే హరిత మెట్‌పల్లిని సాధించగలమని పేర్కొన్నారు. ఒకటో వార్డులో ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్ ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మొక్కలు కావాల్సిన పట్టణ ప్రజలు రేగుంట నర్సరీకి వెళ్లి కూడా మొక్కలను తీసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ పందిరి రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్ నాయక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు ముజీబ్‌తో పాటు మహిళలు, పట్టణ పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి




ధర్మారం, సెప్టెంబర్ 09 : ( ప్రజా కలం ప్రతినిధి ) మండలం లోని పత్తిపాక గ్రామం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బుధవారం రోజున ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా జడ్పిహెచ్ఎస్ పత్తిపాక హైస్కూల్లో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం కాళోజి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా ప్రధానోపాధ్యాయు రాలు సరిత మాట్లాడుతూ కాళోజి తెలంగాణ భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి భాష ద్వారా తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన ప్రజాకవి కాళోజి అని కొనియాడారు ఈ కార్యక్రమం లో ఉపా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మండల స్థాయి ఎస్ జి ఎఫ్ ఆటల పోటీలు ప్రారంభం

-ప్రారంభించిన మండల విద్యాధికారి, ఎస్ జి ఎఫ్ చైర్మన్ సముద్రాల హరికృష్ణ




ఎండపల్లి, సెప్టెంబర్ 09 : ( ప్రజా కలం ప్రతినిధి ) మండల స్థాయి ఎస్ జి ఎఫ్ పోటీలను మండల విద్యాధికారి, ఎస్ జి ఎఫ్ చైర్మన్ సముద్రాల హరికృష్ణ పాటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ నేటి పిల్లలు ఎక్కువ మట్టుకు చరవాణి వాడకం, స్క్రీన్ ఎక్కువ చూడడం వాటికి అలవాటు పడి ఉన్నారని, తద్వారా శారీ రక శ్రమ ఆరు బయట ఆటల పోటీలకు దూరంగా ఉండడం ద్వారా శారీరక శ్రమ శరీర ధారుఢ్యం పై దృష్టి సారించటం లేదని, జీవితంలో ఇబ్బందికరంగా ఉంటుందని కావున నేటి నుండైనా ఆట పోటీల పట్ల ఆరుబయట క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని రోజు వారీ కార్యకలాపల్లో కనీసం ఒక అరగంటైనా వీటికి సమయం కేటాయించి శరీర దారుఢ్యం పై దృష్టి నిల్పాల ని ఎంఈఓ హితువు పలి కారు. ఈరోజు మండలం లోని బాలికలకు అండర్ 14, అండర్ 17 విభాగం లో క్రీడలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీల ప్రారంభానికి ఎండపల్లి పాఠశాలల సముదాయ సహాయ కార్యదర్శి ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యా యులు రవీందర్ రెడ్డి, ఎండపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కొమురయ్య, గోడిశెలపేట స్కూల్ అసిస్టెంట్ హిందీ కిషోర్, మండలంలోని పి ఇ టి, పిడి ఎల్. భూమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆటపాటలతో అలరించిన ఫ్రెషర్స్ పార్టీ..

మల్లాపూర్, సెప్టెంబర్ 09 (ప్రజా కలం ప్రతినిధి)

టీజీఎంఎస్ మల్లాపూర్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీని బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాలలో కొత్తగా చేరిన జూనియర్




విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. పాటలు, నృత్యాలు, వినోద కార్యక్రమాలతో ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్య, క్రమ శిక్షణ, భవిష్యత్తు లక్ష్యాలపై విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. భూమేష్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. ఈ రెండు సంవత్సరాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. కొత్తగా చేరిన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ, వారి ఇంటర్మీడియట్ విద్యా ప్రయాణం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రయాణికుల సురక్షిత ప్రయాణమే

# డ్రైవర్ల ప్రధాన లక్ష్యం

## అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 9(ప్రజా కలం)

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ డ్రైవర్ల ప్రధాన లక్ష్యంగా ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ సూచించారు. జగిత్యాల ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణపై నిర్వహించిన డ్రైవర్ల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, వారి ప్రాణాల భద్రత డ్రైవర్ల బాధ్యతపై ఆధారపడి ఉంటుందని అన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదానికి దారితీసే అవకాశం ఉన్నందున ప్రతి డ్రైవర్ రహదారి భద్రతను వ్యక్తిగత బాధ్యతగా భావించి విధులు నిర్వహించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ప్రమాదకర ఓవర్‌టేకింగ్‌కు దూరంగా ఉండాలని, మలుపులు, కూడళ్లు, వంతెనలు, రద్దీ ప్రాంతాలు, పాఠశాలలు, మార్కెట్ల వద్ద వేగాన్ని నియంత్రించాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం పూర్తిగా నివారించాలని స్పష్టం చేశారు. ఇతర వాహనదారులు చేసే తప్పులను ముందుగానే అంచనా వేసి అవసరమైన సమయంలో వేగాన్ని తగ్గించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి డ్రైవర్ డిఫెన్సివ్ డ్రైవింగ్‌ను అలవర్చుకోవాలని ఎస్పీ సూచించారు. ఆర్టీసీ డ్రైవర్లు క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌కు ఆదర్శంగా నిలవాలని అన్నారు.

**ఉత్తమ డ్రైవర్లకు సన్మానం**

ఉద్యోగ నిర్వహణలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలకు తావులేకుండా సురక్షితంగా విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిన ముగ్గురు ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లను ఎస్పీ అశోక్ కుమార్ శాలువాలతో సన్మానించి అభినందించారు. ఇతర డ్రైవర్లు కూడా వారిని ఆదర్శంగా తీసుకుని ప్రమాదరహిత డ్రైవింగ్‌కు కట్టుబడి విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, డీటీఓ మహమ్మద్ సందాని, ఆర్టీసీ ఆర్ఎం రాజు, డిప్యూటీ ఆర్ఎం భూపతి రెడ్డి, టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, డిపో మేనేజర్లు రమేశ్, మనోహర్, హరి, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్‌తో పాటు ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ లో అంతర్గత రగడ..

- మండల నాయకత్వం పై కార్యకర్తల్లో అసంతృప్తి..!!
- బిఆర్ఎస్ కార్యక్రమాలకు ఆశించిన స్థాయిలో స్పందన కరువు
- ఎమ్మెల్యే జోక్యం తో అయినా పరిస్థితి మారుతుందా..?

మల్లాపూర్, సెప్టెంబర్ 09 (ప్రజా కలం ప్రతినిధి):

మల్లాపూర్ మండల బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు, నాయకుల మధ్య సమన్వయ లోపం మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ధర్నా కార్యక్రమానికి ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడం పార్టీలోని అంతర్గత పరిస్థితులపై మరోసారి చర్చకు దారితీసినట్లు తెలుస్తోంది. మండలంలో పార్టీకి క్షేత్రస్థాయిలో క్యాడర్ ఉన్నప్పటికీ ముఖ్య నాయకుల మధ్య సమన్వయం కొరవడటం వల్లే కార్యక్రమాలకు ఆశించిన స్పందన రావడం లేదనే అభిప్రాయాలు కొందరు కార్యకర్తల్లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

**రైతు ధర్నా ఎఫెక్ట్.. బయటపడుతున్న విభేదాలు?**

రైతుల సమస్యలపై నిర్వహించిన ధర్నాను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకత్వం విస్తృతంగా ప్రయత్నించినప్పటికీ కార్యక్రమానికి రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకాకపోవడం చర్చకు కారణమైంది. సాధారణంగా రైతు సమస్యలపై నిర్వహించే కార్యక్రమాలకు క్షేత్రస్థాయి నుంచి మంచి స్పందన ఉండాల్సి ఉండగా ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా కనిపించిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీంతో అసలు సమస్య కార్యక్రమ నిర్వహణలోనా.. లేక నాయకుల మధ్య సమన్వయ లోపంలోనా అన్న చర్చ పార్టీలో మొదలైనట్లు తెలుస్తోంది.

మరోవైపు కొంతకాలంగా మండల పార్టీలో నాయకులు, కార్యకర్తల మధ్య దూరం పెరుగుతోందనే చర్చ కూడా ఉంది. పార్టీ కార్యక్రమాలపై ముందస్తు సమన్వయం లేకపోవడం, కీలక నిర్ణయాల్లో మండల అధ్యక్షుడు అందరినీ



కలుపుకొని వెళ్లకపోవడం వంటి అంశాలపై కొందరు కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దీంతో పార్టీ కోసం పనిచేస్తున్న క్షేత్రస్థాయి కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా మండల అధ్యక్ష పదవి చుట్టూ కూడా కొందరు నాయకులు తమ రాజకీయ భవిష్యత్తుకు అనుగుణంగా అంతర్గతంగా సమీకరణాలు చేసుకుంటున్నారనే చర్చ ఉంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కార్యకర్తలతో మాట్లాడి పార్టీ పరిస్థితిపై ఆరా తీసినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించినట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే జోక్యంతోనైనా మండల నాయకత్వంలో సమన్వయం పెరుగుతుందా? ప్రస్తుతం కొనసాగుతున్న అంతర్గత విభేదాలకు తెరపడుతుందా? లేక ఇదే పరిస్థితి కొనసాగుతుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

# వినాయక నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రతా చర్యలు

- 35 మంది డీజే ఆపరేటర్లు, ట్రబుల్ మాంగర్లకు రూ.5 లక్షల పూచీకత్తుతో బైండోవర్







మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 9(ప్రజా కలం): వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మెట్‌పల్లి పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కమ్యూనిటీ హెల్పర్స్, పీస్ కమిటీ సభ్యులతో పాటు డీజే ఆపరేటర్లు, ట్రబుల్ మాంగర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. మెట్‌పల్లి డీఎస్పీ ఎ. రాములు, సీఐ బి. సురేష్ బాబు, ఎస్ఐ పి. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాల్లో ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, గొడవలు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేయరాదని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని డీజే ఆపరేటర్లకు పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో ఉత్సవాల సమయంలో గొడవలకు పాల్పడిన, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇందులో భాగంగా 35 మంది డీజే ఆపరేటర్లు, ట్రబుల్ మాంగర్లను తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట రూ. 5 లక్షల పూచీకత్తుతో బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ పరస్పర సహకారంతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు మెట్‌పల్లి పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.

# పోచమ్మతల్లి ఆశీస్సులు యావత్ సమాజంపై ఉండాలి

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 9(ప్రజా కలం)

జగిత్యాల పట్టణంలోని పురాణిపేటలో కొలువైన శ్రీ లోకమాత పోచమ్మతల్లి దేవాలయంలో జరుగుతున్న 64వ వార్షికోత్సవ ఉత్సవ కార్యక్రమాల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి పాల్గొని పోచమ్మతల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. లోకమాత పోచమ్మతల్లి ఆశీస్సులు యావత్ సమాజంపై ఉండాలని ఆకాంక్షించారు. హెలినో ప్రభావంతో ప్రకృతి, పర్యావరణానికి ఎలాంటి విఘాతం కలగకుండా, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు తొలగిపోయి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించేలా పోచమ్మతల్లి దీవెనలు అందరిపై ఉండాలని అన్నారు. జగిత్యాల పురాణిపేటలోని లోకమాత పోచమ్మతల్లి దేవాలయంలో నిర్వహిస్తున్న 64వ వార్షికోత్సవ ఉత్సవాల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు తాటిపర్తి రాంచంద్రరెడ్డి బీఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, శ్రీరాముల గంగాధర్, కొక్కుల గంగాధర్, హరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా కాళోజీ స్ఫూర్తి

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ప్రజాకవి జయంతి వేడుకలు




జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 9 (ప్రజాకలం)

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్‌తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజల సమస్యలను తన రచనల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చి, సమాజంలో చైతన్యం నింపిన కాళోజీ నారాయణరావు సేవలను అధికారులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. సామాన్యుడి గొంతుకగా నిలిచిన కాళోజీ రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వారికి మరింత చేరువగా ఉంటూ సేవలందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అదనపు ఎస్పీ చేతన్ నితిన్ సూచించారు. ప్రజల భద్రత, సంక్షేమం కోసం పోలీస్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, వేణు, సైదులు, శ్రీధర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రజాకవికి ఘన నివాళులు

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 9 (ప్రజాకలం) మున్సిపల్ కార్యాలయంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి



పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు జయంతిని ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. కాళోజీ నిస్వార్థ త్యాగం, ప్రజాసేవ, తెలంగాణ భాషా సాహిత్యానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తన రచనలు, కవిత్వం ద్వారా ఎత్తిచూపిన కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కాళోజీ చూపిన బాటలో మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజలకు పారదర్శకమైన, మెరుగైన సేవలు అందించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని చైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని కాళోజీ నారాయణరావుకు ఘన నివాళులర్పించారు.

# వంట గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు

హైదరాబాద్ : వంటగ్యాస్ బుకింగ్ గడువును తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది గ్రామీణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్ గడువును 45 రోజుల నుంచి 25 రోజులకు తగ్గిస్తున్నట్లు కేంద్రమంత్రి సురేశ్ గోపీ వెల్లడించారు. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఎల్పీజీ సరఫరాపై పడిన ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని గతంలో దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సిలిండర్ బుకింగ్ నిబంధనల్లో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పు చేసింది. ఆ మార్పుల ప్రకారం రీఫిల్ బుకింగ్ మధ్య గడువు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులుగా నిర్ణయించారు. అయితే ప్రస్తుతం ఎల్పీజీ సరఫరా పరిస్థితులు మెరుగుపడటంతో పాటు రీఫిల్ పెండింగ్ బాకీలు బ్యాక్‌లాగ్ కూడా గణియంగా తగ్గడంతో ఇకపై గ్రామీణ ప్రాంతాల్లో కూడా పట్టణ ప్రాంతాలతో సమానంగా 25 రోజులకు ఒకసారి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. తక్షణమే అమల్లోకి:అయితే దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సిలిండర్ బుకింగ్ నిబంధనల్లో తీసుకువచ్చిన ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్రం స్పష్టం చేసింది.

ప్రజా కలం
గురువారం, సెప్టెంబర్ 10, 2026

# సంపూర్ణ విప్లవ ఉద్యమం

జంతర్ మంతర్ వద్ద పోరాట జ్వాలలు జ్వలించిన జూలై తొలి రోజుల్లో అక్కడకు వెళ్లి యువ ఉద్యమకారులకు సంఘీభావం తెలిపిన రాజకీయవేత్తలలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా ప్రథమురాలు. మూడు వారాల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినప్పుడు 'ఫాసిస్టు, మత దురహంకార ప్రభుత్వాన్ని దానోహం చేసుకుని భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడినందుకు' ఆ యువ చైతన్యశీలురకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గత పన్నెండు సంవత్సరాలుగా ప్రతిపక్షాలు సాధించలేని దానిని కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) సాధించిందని కూడా ఆమె వ్యాఖ్యానించారు. మహువా మెచ్చుకోలు పూర్తిగా యోగ్యమైనది. విద్యామంత్రి రాజీనామా, పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు హోంమంత్రి సుదీర్ఘంగా గైర్హాజరవడం, బీజేపీ సంస్థాగత పదవులలో ఉన్న పలువురు సీనియర్ నాయకులకు ఉన్నపాటున ఉద్వాసన చెప్పడం, మరీ ముఖ్యంగా నడిరేయి వేళ ప్రధానమంత్రి వీడియో సందేశాలు... ఇవన్నీ, దురహంకారమే సహజ నైజంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం కనీసం తాత్కాలికంగానైనా బలహీనపడి, గందరగోళంలో పడిందని నిరూపించాయి. సీజేపీ యువ పోరాటశీలురు ఇప్పటివరకు సృష్టించిన అపూర్వ చైతన్య ప్రభంజనాన్ని అదే రీతిలో కొనసాగించి తద్వారా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఇత్యాది రాజ్యాంగబద్ధ హామీలను మరింత సంపూర్ణంగా పునరుద్ధరించగలరా? లేదా అనే విషయాన్ని ఇప్పటికిప్పుడు చెప్పలేము. ఏమైనా సీజేపీ ఒక అపూర్వ ఆశాభావాన్ని మొలకెత్తించింది. చరిత్రకారులు జ్యోతిషులు కాదు కనుక, భవిష్యత్తులోకి దృష్టి సారించే బదులు గతకాలంలో జంతర్ మంతర్ ఆందోళనలకు సదృశమైన పోరాటాల వైనాలను అన్వేషించదలచుకున్నాను. ప్రజాజీవితంపై చెరగని ముద్ర వేసిన భారతీయ విద్యార్థి ఉద్యమాలలో ఎన్నదగిన మొట్టమొదటిది 125 సంవత్సరాల క్రితం ప్రజ్వరిల్లింది. బెంగాల్‌లో స్వదేశీ ఉద్యమంలో అది అంతర్భాగంగా ఉంది. చరిత్రకారుడు సుమిత్ సర్కార్ ఇలా వ్యాఖ్యానించారు: బెంగాల్‌లోని ప్రతి జిల్లాకు చెందిన ఎంతో మంది యువజనులు విద్యాభ్యాసానికి కలకత్తాలో ఉన్నారు. వారి ద్వారానే స్వదేశీ ఉద్యమం వంగభూమిలో నలుమూలలకూ దావానలంలా వ్యాపించింది'. 'ఉద్యమ నాయకులు చాలా వరకు డాక్టర్లు, న్యాయవాదులు మొదలైన వృత్తి నిపుణుల కుటుంబాలు లేదా భూస్వామ్య కుటుంబాల నుంచి వచ్చినవారు కాగా కార్యకర్తలు అందరూ విద్యార్థులే. వారిలో అత్యధికులు నవయవ్వనంలో ఉన్నవారే 'అని కూడా సుమిత్ సర్కార్ పేర్కొన్నారు. తదనంతర సంవత్సరాలలో విద్యార్థులు గాంధీ, భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలో వలసపాలన వ్యతిరేక ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారు. సహాయ నిరాకరణ ఉద్యమం, పౌర శాసనోల్లంఘనలోనూ పురుష విద్యార్థులు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారు, జైలుకు వెనుకాడేవారు కాదు. క్విట్ ఇండియా ఉద్యమంలో విద్యార్థి లోకం చరిత్రాత్మక పాత్ర నిర్వహించింది. వేలాది విద్యార్థులతో జైళ్లు నిండిపోయాయి. విద్యార్థినులు, యువ మహిళలు క్రియాశీల పాత్ర నిర్వహించడం క్విట్ ఇండియా ఉద్యమ మరో విశిష్ట చరిత్ర. ఈ సందర్భంగా బొంబాయి విశ్వవిద్యాలయ విద్యార్థిని ఉషా మెహతా పాత్ర గురించి ప్రస్తావించవలసి ఉన్నది. వలస పాలకులపై తిరుగుబాటు చేసిన ఉష అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆ రహస్య జీవితంలో ఆమె నిర్వహించిన 'కాంగ్రెస్ రేడియో' విద్యార్థులను, ప్రజలను సమరోన్ముఖులను చేసింది. చారిత్రక పత్రాల భాండాగారంలో ఉన్న 'కర్ణాటక్ ఇన్ రివోల్ట్' అన్న ఫైలును నేను అధ్యయనం చేశాను. ఇప్పుడు కర్ణాటక రాష్ట్రంగా ఉన్న ప్రాంతాలలో విద్యార్థుల పోరాట పటిమ క్విట్ ఇండియా ఉద్యమ విశేష లక్షణంగా ఉందని ఆ పత్రాలు తెలియజేశాయి. బెల్గాం, గడాగ్, బెంగళూరు, మైసూరు, మంగుళూరు, బీజాపూర్, బళ్లారి, సిర్సి మొదలైన పట్టణాలు, నగరాలలో విద్యార్థులు పెద్దసంఖ్యలో ఉద్యమంలో పాల్గొన్నారు. బాయ్‌కాట్‌లు, హర్తాళ్ల నిర్వహణతో అధికారులకు దడ పుట్టించారు. 23 అక్టోబర్ 1942న ధార్వాడ్‌లో మిస్ షెనోలికర్, మిస్ గుల్వాడి అనే విద్యార్థినులు జిల్లా న్యాయస్థానంలోకి ప్రవేశించి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి అక్కడ ఉన్న జిల్లా జడ్జికి మిమ్ములను ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేస్తున్నామని చెప్పి, కరపత్రాలు పంచి అదృశ్యమయ్యారు. వలసపాలన నుంచి విముక్తి పొందిన అనంతర కాలంలో విద్యార్థులు ఏ విధంగా వ్యవహరించారు? 1968లో ఫిలిప్ జి. ఆల్ట్‌బచ్ అనే సామాజిక శాస్త్రవేత్త సంపాదకత్వంలో 'టర్మొయిల్ అండ్ ట్రాన్సిషన్: హైయర్ ఎడ్యుకేషన్ అండ్ స్టూడెంట్ పాలిటిక్స్ ఇన్ ఇండియా' అన్న పుస్తకం వెలువడింది. ఆల్ట్‌బాచ్ తన ముందుమాటలో ఇలా రాశారు: 'భారత స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థులు కీలకపాత్ర వహించారు. అయితే 1947 అనంతరం విద్యార్థులు నిర్వహించిన ఆందోళనలేవీ రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధం ఉన్నవి కావు. అధిక ఫీజులు, హాస్టల్ సదుపాయాలు నాసిరకంగా ఉండడం మొదలైన సమస్యలపై ఆందోళనలకు దిగారు. వాటితోపాటు వివిధ సాంస్కృతిక కార్యకలాపాలకు సంబంధించిన విషయాలపై కూడా 1960ల్లో భారతీయ విద్యార్థులు ఆందోళనలు చేశారని ఆ పుస్తకం వెల్లడించింది. ఆల్ట్‌బాచ్ పుస్తకం వెలువడిన ఏడాదిలోగానే భారతీయ విద్యార్థులు రాజకీయ ఆందోళనా పథాలలోకి పునఃప్రవేశించారు. 1969లో ప్రారంభమైన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులదే కీలక పాత్ర. ఆ ఉద్యమ లక్ష్యం దశాబ్దాల అనంతరం మాత్రమే ఫలించింది. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో విద్యార్థులు నిర్ణయాత్మక పాత్ర వహించిన మూడు ప్రాంతీయ ఉద్యమాలలో ప్రత్యేక తెలంగాణ మొదటిది. మిగతావి అస్సాం ఉద్యమం, ఉత్తరాఖండ్ ఉద్యమం. అస్సాం ఉద్యమానికి నాయకత్వం వహించిన 'ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్' నుంచి ప్రభవించిన అసోం గణపరిషత్ 1985 అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించింది. గత దశాబ్దంలో తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి రావడంలో కూడా విద్యార్థులు, కీలక పాత్ర వహించారు. స్వతంత్ర భారత చరిత్రలోని నిర్మాణాత్మక విద్యార్థి ఆందోళనల పరంపరను సీజేపీ పోరాటం ప్రతిబింబిస్తున్నదని చరిత్రకారుల అభిప్రాయం. వాటిలో ముఖ్యమైనది 1970ల మధ్యకాలంలో జరిగిన జేపీ ఉద్యమం. ఘన్ శ్యామ్ షా అనే రాజనీతి శాస్త్రవేత్త తన హ్రతీశీవర్ వీశీజవవఎవత్‌ం ఱఅ ఇశీ ×అఎఱఖఱఅ క్ష్ఫ్‌వం' అన్న పుస్తకంలో గుజరాత్, బిహార్ రాష్ట్రాల్లో విద్యార్థి ఆందోళనలను నిశితంగా పరిశీలించారు. 'గుజరాత్‌లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి చిమన్ భాయ్ పటేల్ అవినీతిపరుడుగా పేరు పొందారు. విద్యార్థులు ఆయన్ను లక్ష్యంగా చేసుకుని ఆందోళనలకు ఉపక్రమించారు. చిమన్ భాయ్‌ని అధికారంలో కొనసాగిస్తున్నందుకు ప్రధానమంత్రి ఇందిరాగాంధీపై కూడా వారు ధ్వజమెత్తారు. ధరల పెరుగుదల ఆ ఉద్యమానికి ఆజ్యం పోసింది'. గుజరాత్‌లో వలే బిహార్‌లో కూడా విద్యార్థులు ఉద్యమంలో అగ్రగాములుగా ఉన్నారు. బిహార్‌లో విద్యార్థులకు ఒక ప్రముఖ వ్యక్తి నాయకత్వం లభించింది. ఆ ఉదాత్తుడు లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్. 'ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు' ఒక సంవత్సరం పాటు విద్యాభ్యాసానికి విరామం చెప్పాలని విద్యార్థులకు జయప్రకాశ్ విజ్ఞప్తి చేశారు. ఆయన మాటను విద్యార్థులు గౌరవించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వారితో పాటు సోషలిస్టు భావజాల ప్రభావిత విద్యార్థులు కూడా ఆయన నాయకత్వం పట్ల ఆకర్షితులయ్యారు. ప్రస్తుత విద్యార్థి ఉద్యమం ఒక విషయంలో జేపీ ఉద్యమానికి సదృశంగా ఉన్నది. అది నిరంకుశత్వం, వ్యక్తిపూజను వ్యతిరేకించడం. ఈ రెండు అప్రజాస్వామిక ధోరణులకు 1970ల్లో ఇందిరాగాంధీ, ఆమె పార్టీ, ఇప్పుడు నరేంద్ర మోదీ, ఆయన పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఏబీవీపీ అప్పుడు పాలక పక్షాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది, ఇప్పుడు అది పూర్తిగా పాలక పక్షం వైపు ఉన్నది. జేపీ ఉద్యమంతో పోలిస్తే ప్రస్తుత ఉద్యమంలో విద్యార్థినులు, యువతులు చాలా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారి ఆదర్శవాదం, ధైర్యసాహసాలు 1942నాటి మహిళా ఉద్యమకారుల పోరాట పటిమ, ఉదాత్త ఆదర్శాలను గుర్తు చేస్తున్నాయి. 1970ల నాటి విద్యార్థి ఉద్యమాల ఉప్పెన రెండో స్వాతంత్ర్య పోరాటంగా ప్రసిద్ధికెక్కింది. అది, మొదటి స్వాతంత్ర్య పోరాట వాగ్దానాలను సంపూర్ణంగా నెరవేర్చేందుకు సంకల్పించింది, కృషి చేసింది.

# అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్ట్



పెద్దపల్లి:సెప్టెంబర్ 09:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ట్రైన్లలో వచ్చి ద్విచక్ర వాహనాలను దొంగిలించి,ఒంటరి మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఉత్తరప్రదేశ్ కు చెందిన ఒకరిని పెద్దపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు.బుధవారం పెద్దపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ జి.కృష్ణ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ భూక్యా రామ్ రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని షామ్లి జిల్లా,కైరాన తహసిల్,ఖన్పూర్ కాల గ్రామానికి చెందిన కలిరామ్ (38)పాల వ్యాపారి తన స్నేహితుడైన కపిల్‌తో కలిసి జల్సాల కోసం దొంగతనాలకు అలవాటు పడ్డాడు.వీరిద్దరూ ఉత్తరప్రదేశ్ నుండి రైలులో బయలుదేరి వివిధ రాష్ట్రాల్లోని పట్టణాలకు చేరుకునేవారు.అక్కడ మొదట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను దొంగిలించి,వాటిపై తిరుగుతూ ఒంటరి మహిళల మెడలోని బంగారు గొలుసులను లాక్కుని పరారయ్యేవారు.మార్చి 30న పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో దిగి,రైల్వే కాలనీలో ఒక ఇంటి ముందున్న పల్సర్ బైక్‌ను దొంగిలించారు.ఆపై బంధంపల్లి వద్ద రోడ్డుపై ఉన్న గుండు నర్సమ్మ మెడలోని 2 తులాల బంగారు పుస్తెల త్రాడును తెంపుకొని పరారయ్యారు.అదే రోజు రాత్రి రామగుండం ఓల్డ్ బజార్‌లో కోల కుసుమ అనే మహిళ వద్ద నుండి 45 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని,ఆ బైక్‌ను బల్హార్షా వద్ద వదిలేసి రైలులో ఉత్తరప్రదేశ్ పారిపోయారు.మే 29న మరలా పెద్దపల్లి వచ్చి బస్ స్టాండ్ ముందున్న పల్సర్ బైక్‌ను దొంగిలించారు.అయితే దొంగతనం చేసే అవకాశం దొరక్కపోవడంతో ఆ బైక్‌ను బెల్లంపల్లి వద్ద దాచి స్వగ్రామానికి వెళ్లారు.ఆగస్టు17న పెద్దపల్లి కాలేజీ మైదానం వద్ద పల్సర్ బైక్‌ను దొంగిలించి, లక్ష్మీనగర్‌లో నూనె స్వరూప అనే మహిళ మెడలోని 30 గ్రాముల బంగారు గొలుసును తెంపుకెళ్లారు.అనంతరం బైక్‌ను వాంకిడి– బల్హార్షా మధ్య వదిలి పారిపోయారు.వరుస నేరాల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి,ఏసీపీ జి.కృష్ణల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.సాంకేతిక ఆధారాలు,సీసీ కెమెరాల దృశ్యాల ద్వారా నిందితులను ఉత్తరప్రదేశ్‌కు చెందిన భవానియా ముఠాగా గుర్తించారు.ఈ క్రమంలో గతంలో బెల్లంపల్లి వద్ద దాచిన బైక్‌తో కలిరామ్ పెద్దపల్లి రైల్వే స్టేషన్ వద్ద కపిల్ కోసం వేచి చూస్తుండగా,పక్కా సమాచారంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.నిందితుడి నుంచి పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.చోరీ సొత్తు పరారీలో ఉన్న కపిల్ వద్ద ఉన్నట్లు నిందితుడు విచారణలో వెల్లడించినట్లు డీసీపీ పేర్కొన్నారు. నిందితుడిపై పెద్దపల్లి,రామగుండం పోలీస్ స్టేషన్లలో 5 కేసులు నమోదైనట్లు వెల్లడించారు.చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్ఐ నరేష్,సిసిఎస్ ఎస్ఐ నసీర్,హెచ్‌సి కె.సుధాకర్,పిసిలు కె.ప్రభాకర్,కె.విజయ్ కుమార్,బి.ప్రేమ్ సాగర్‌లను పెద్దపల్లి పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

# తెలంగాణ ఉద్యమ నాయకుడు తంగళ్లపల్లి చక్రపాణి మృతి

వెల్గటూర్, సెప్టెంబర్9, ప్రజాకలం, ప్రతినిధి :

తెలంగాణ ఉద్యమ నాయకుడు తంగళ్లపల్లి చక్రపాణి ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్ సోకి కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. టిఆర్ఎస్ అంటే మండలంలో ఎవ్వరికి తెలియని సమయంలో తెలంగాణ జెండాను గుండెలకు హత్తుకొని, పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసాడు చక్రపాణి. టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సమయంలో మండలంలో ఆ పార్టీని ఎవ్వరు గుర్తించి, ఆదరించని సమయంలో తానే ఒక నాయకుడిల, కార్యకర్తలా జండాను భుజాన మోసి వెల్గటూర్ మండలంలో నలు దిక్కుల తెలిసేవిధంగా చేయడంలో విజయాన్ని సాధించాడు. పూటకు ఓ పార్టీ మార్చే నేటి రోజులల్లో నమ్ముకున్న పార్టీ, నాయకుడి కోసం రెండు దశాబ్దాల పాటు కష్టపడి మండలంలో పార్టీకి ఒక గుర్తింపును తీసుకువచ్చిన చక్రపాణి మృతి చెందడం మండల ప్రజల మనసులను కలిచి వేసింది.



వెల్గటూర్ మండలంలోని గొడిసెలపేట గ్రామానికి చెందిన తంగల్లపల్లి చక్రపాణి తెలంగాణ పార్టీ ఆవిర్భావం నుంచి వెల్గటూర్ మండలంలో అపార్టీ క్రియాశీల సభ్యుడిగా తన బాధ్యతలను నిర్వహించాడు. మొదట్లో వెల్గటూర్ మండలంలో టిఆర్ఎస్ అంటే చక్రపాణి, చక్రపాణి అంటే టిఆర్ఎస్ అనే విధంగా ఉండేది. టిఆర్ఎస్ అంటే ఆదరణ లేని ఆ సమయంలో పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు తన వెంట ఎవ్వరు లేకపోయినా బందులు, రాస్తారోకోలను విజయవంతంగా నిర్వహించాడు. ఎవ్వరికి భయపడకుండా నల్ల జెండాలతో అప్పటి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలను కూడా నిర్వహించాడు. ఒక సమయంలో వెల్గటూర్ మండల కేంద్రంలో ప్రజలచే ఎన్నుకోబడిన టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు కుర్చీ కూడా వేసే పరిస్థితి లేని సమయంలో, ప్రతి షాపు తిరిగి కుర్చీలను పోగు చేసి పత్రికా సమావేశాలను నిర్వహించాడు. కష్ట కాలంలో పార్టీని విజయవంతంగా విజయపతంలో నడిపించిన చక్రపాణి రెండు సార్లు టిఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా పని చేసాడు. ఒక పర్యాయం తన జీవిత బాగాస్వామి భవానిని సర్పంచ్ గా గెలిపించుకొని తన ద్వారా గ్రామానికి సేవలను అందించాడు. కాగా తంగళ్లపల్లి చక్రపాణి ఇక లేడు అనె నిజాన్ని మండల మరియు గ్రామ ప్రజలు జీవించుకోలేకపోతున్నారు. ఆయన మృతితో గొడిశెలపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# చిన్నతాండ పాఠశాలలో సమస్యలపై సర్పంచ్ ఫైర్

## ఉపాధ్యాయుల సమయపాలన, మధ్యాహ్న భోజనంపై సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు



గద్వాల ప్రతినిధి సెప్టెంబర్ 9 ప్రజా కలం:

మండలంలోని పెద్దతాండ ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై పెద్దతాండ సర్పంచ్ నార్య నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మల్దకల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాఠశాలలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ నార్య నాయక్ మాట్లాడుతూ.. పాఠశాలకు ఉపాధ్యాయులు నిర్ణీత సమయానికి రావడం లేదని, ఉదయం విద్యార్థులతో ప్రార్థన కార్యక్రమం కూడా సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపించారు.దీంతో విద్యార్థులు ఉపాధ్యాయుల కోసం పాఠశాల బయట వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

అలాగే పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే వారికి గిట్టుబాటు కావడం లేదని వంట వారు తెలియజేస్తున్నారనీ ఆరోపించారు.

ఈ విషయాలను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) జి. సురేష్ దృష్టికి తీసుకు రావడం జరిగిందని తెలిపారు. దానికి జవాబుగా ఇంతకు ముందు పాఠశాలను సెప్టెంబర్ 2వ తేదీన ప్రార్థనా సమయానికి పాఠశాలను సందర్శించడం జరిగిందని అన్ని విషయాలను ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించడం జరిగిందని ఇంతకు ముందు పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన ప్రదానోపాధ్యయులకు మెమో కూడా ఇవ్వడం జరిగిందని , ఏ ఉపాధ్యాయుడు విధులు నిర్లక్ష్యం చేసినా వారిపై తప్పక చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి తెలియజేయడం జరిగింది. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని చెబుతున్నప్పటికీ పెద్దతాండ పాఠశాలలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు.

పాఠశాల భవనంలో పెచ్చులు ఊడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, విద్యార్థుల భద్రతకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడకముందే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇకపై కూడా ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా విధులకు ఆలస్యంగా హాజరవుతుంటే జిల్లా కలెక్టర్‌కు నేరుగా ఫిర్యాదు చేస్తానని సర్పంచ్ నార్య నాయక్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన విద్యా వ్యవస్థలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

# దళితులపై రాజకీయ ప్రేమ ఎందుకు?

మల్లాపూర్ సెప్టెంబర్ 09 ( ప్రజా కలం ప్రతినిధి)

అసెంబ్లీలో సభాపతి గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యల అంశంపై జరుగుతున్న చర్చ దళితులపై ప్రేమతోనా? లేక దళిత ఓట్ల కోసమా అని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జగిత్యాల జిల్లా నాయకుడు మోర్తాడ్ అన్వేష్ ప్రశ్నించారు. దళితులపై నిజంగా ప్రేమ ఉంటే దళితులు హత్యలకు గురైనప్పుడు ఎందుకు రాజకీయ నాయకులు స్పందించలేదని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమయాన్ని రాజకీయ అంశాలకు వృథా చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

# ఉప సర్పంచుల చెక్ పవర్ రద్దు చేయాలి

## - కలెక్టరేట్ ఎదుట సర్పంచుల ధర్నా




పెద్దపల్లి,సెప్టెంబర్ 09:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పంచాయతీల్లో గ్రామాభివృద్ధి పనులకు అవరోధంగా మారిన ఉప సర్పంచుల చెక్ పవర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్పంచులు బుధవారం జిల్లా కలెక్టరేట్ ముట్టడికి దిగారు.రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుల పిలుపు మేరకు కలెక్టరేట్‌కు చేరుకున్న సర్పంచులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.మరోవైపు జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన సర్పంచులకు కలెక్టరేట్‌లో కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా ఏర్పాటు చేయకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారుల తీరుకు నిరసనగా కలెక్టరేట్ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట సర్పంచులు నేలపై బైఠాయించి కాసేపు ధర్నా నిర్వహించారు. సర్పంచులుగా బాధ్యతలు చేపట్టి తొమ్మిది నెలలు కావస్తున్నా,ఉప సర్పంచుల వైఖరి వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.పాలకుర్తి సర్పంచ్ నిర్మల మాట్లాడుతూ అభివృద్ధి పనుల బిల్లులపై ఉప సర్పంచులు కావాలనే సంతకాలు పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.ఉప సర్పంచులకు చెక్ పవర్ తొలగిస్తేనే పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని,ప్రభుత్వం ఈ సమస్యపై వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు గ్రామాల సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్‌నినో వేళ నీటి పొదుపు తప్పనిసరి

## - జిల్లా ఉద్యానశాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్



సుల్తానాబాద్,సెప్టెంబర్ 09 (ప్రజా కలం జిల్లాప్రతినిధి) ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారే అవకాశం ఉన్నందున రైతులు సాగునీటిని సమర్థవంతంగా,పొదుపుగా వినియోగించుకోవాలని పెద్దపల్లి జిల్లా ఉద్యానశాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు.బుధవారం సుల్తానాబాద్ మండలంలో పర్యటించిన ఆయన,వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ సాగునీటి వ్యవస్థలను మరియు కూరగాయల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా డ్రిప్ పరికరాల నాణ్యత, కంపెనీలు చేపడుతున్న పనుల్లో పారదర్శకత,రైతులకు అందుతున్న సబ్సిడీ సేవలను స్వయంగా రైతులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటి వినియోగాన్ని తగ్గించి నేరుగా మొక్కల వేర్లకు నీటిని అందించేందుకు డ్రిప్,స్ప్రింక్లర్ పద్ధతులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా సూక్ష్మ సాగునీటి పరికరాలపై ఎస్సీ,ఎస్టీ రైతులకు 90 శాతం,బీసీ చిన్న,సన్నకారు రైతులకు 80 శాతం,ఇతర సాధారణ రైతులకు 70 శాతం భారీ సబ్సిడీ అందిస్తోందని,అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కూరగాయల సాగు,నీటి యాజమాన్యం,పురుగు–తెగుళ్ల నివారణపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో కేవీకె రామగిరి ఖిల్లా సీనియర్ శాస్త్రవేత్త వెంకట రమేష్,ఉద్యాన శాస్త్రవేత్త భాస్కర్ రావు, కీటక శాస్త్రవేత్త వెంకన్న,వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త వినోద్,ఉద్యానశాఖ అధికారి ఎస్. మహేష్,రైతులు పాల్గొన్నారు.

# ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చిన కాళోజీ కృషి

## - అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి,సెప్టెంబర్ 09:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రజల్లో సామాజిక,రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చిన కాళోజీ కృషి మరువలేనిదని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారికంగా నిర్వహించిన కాళోజీ నారాయణరావు జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి,కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ సామాజిక సమస్యలపై నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా స్పందించే వ్యక్తిత్వం కాళోజీది అన్నారు.సత్యాగ్రహ మహోద్యమంలో పాల్గొని పిన్న వయసులోనే జైలు జీవితం గడిపారని తెలిపారు.విద్యార్థి దశ నుండే నిజాం ప్రభుత్వం నిషేధాజ్ఞలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకులు కాళోజీ అని కొనియాడారు.తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని,ప్రజాకవి కాళోజీ రచనలు,సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని, ముఖ్యంగా యువత కాళోజీ ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్,సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు నిర్వహించాలి

## - పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి



పెద్దపల్లి:సెప్టెంబర్ 09:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని,విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి సూచించారు. బుధవారం డీసెంట్ ఫంక్షన్ హాల్‌లో ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఏసీపీ జి.కృష్ణ,సీఐ ప్రవీణ్ కుమార్‌లతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ అనుమతులు తప్పనిసరి అని స్పష్టం చేస్తూ,విద్యుత్ వైరింగ్ సురక్షితంగా ఉండాలని, అగ్నిప్రమాదాల నివారణతో పాటు మహిళలు,చిన్నారుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.డీజేలు, అధిక శబ్దాల సౌండ్ సిస్టమ్‌లు,అసభ్యకర ప్రదర్శనలు,తాగి గందరగోళం సృష్టించడం వంటి చర్యలపై కఠినంగా ఉంటామని హెచ్చరించారు.భక్తుల రద్దీని క్రమబద్ధీకరిస్తూ అత్యవసర వాహనాల రాకపోకలకు మార్గాన్ని అందుబాటులో ఉంచాలని,విగ్రహ ప్రతిష్ఠాపన నుండి నిమజ్జనం వరకు ఎక్కడైనా సమస్య తలెత్తితే స్వయంగా నిర్ణయాలు తీసుకోకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ జి.కృష్ణ,సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్ ఐలు నరేష్,మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయశాస్త్రంలో డా.చిరుమిల్ల అర్చన-రాకేష్‌కు డాక్టరేట్




పెద్దపల్లి:సెప్టెంబర్ 09:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) న్యాయశాస్త్రంలో విశేష పరిశోధనలు చేసిన డా.చిరుమిల్ల అర్చన-రాకేష్ ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ కాన్వొకేషన్ వేడుకల్లో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు.భూవివాదాల పరిష్కారంలో ఏడీఆర్ పద్ధతుల ప్రాముఖ్యతపై ఆమె సమర్పించిన సెటిల్మెంట్ అఫ్ ల్యాండ్ డిస్పుట్స్ ఇన్ ఏడిఆర్ మెథడ్స్ పరిశోధనా రహిత గ్రంథానికి గానూ ఓయూ ఆమెకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది.మంగళవారం రాత్రి అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ,ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం,భారత్ బయోటెక్ వ్యవస్థాపకులు డా.కృష్ణ ఎల్లా చేతుల మీదుగా అర్చన ఈ డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. ఈ వేడుకలో ఈసీ సభ్యులు ప్రొఫెసర్ బాణాపురం మధుసూదన్ రెడ్డితో పాటు పలువురు విద్యావేత్తలు పాల్గొన్నారు.న్యాయవాదిగా సుదీర్ఘ అనుభవం ఉన్న డా.చిరుమిల్ల అర్చన గతంలో తెలంగాణ హైకోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా సేవలందించారు. ప్రస్తుతం హైకోర్టు ప్రాక్టీసింగ్ అడ్వకేట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.ఆమె తెలంగాణ తొలి టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా.చిరుమిల్ల రాకేష్ కుమార్ సతీమణి సమాజానికి ఎంతో ఉపయోగపడే భూవివాదాల పరిష్కారఅంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసినడా.అర్చన-రాకేష్‌ను పలువురు న్యాయవాదులు,ప్రముఖులుశ్రేయోభిలాషులు ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రభుత్వ భూమిని రక్షించండి - తక్షణమే సర్వే నిర్వహించాలి

**- పువ్వాడ నగర్ సర్పంచ్ షేక్ సిద్దిక్ డిమాండ్**

**- అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించిన గ్రామ పంచాయతీ**

ఖమ్మం /రఘునాథపాలెం సెప్టెంబర్ 09 ( ప్రజా కలం న్యూస్ )

రఘునాథపాలెం మండలం పరిధిలోని పువ్వాడ నగర్ గ్రామంలోని సర్వే నంబర్ 192లోని అసైన్డ్ (ప్రభుత్వ) భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలపై, లేఅవుట్లపై తక్షణమే సర్వే నిర్వహించి,ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ షేక్ సిద్దిక్ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సర్వే నంబర్ 192లో ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, దీనిపై సర్వే జరిపించాలనిపలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు సరైన స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి పరిరక్షణే లక్ష్యంగా ఇప్పటికే గ్రామ పంచాయతీలో ఏకగ్రీవంగా తీర్మానం కూడా ఆమోదించినట్లు తెలిపారు.

**ఉమ్మడి సర్వేతోనే నిజాలు వెలుగులోకి:**

రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో ఏకకాలంలో ఉమ్మడి సర్వే నిర్వహించాలని కోరారు. ఆ సర్వే ద్వారా అక్రమంగా వెలిసిన లేఅవుట్లు, నివాసాలను గుర్తించి, వాటిని తక్షణమే తొలగించి విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

**అసత్య ప్రచారాలను నమ్మవద్దు:**

ఇటీవల కొన్ని మాధ్యమాల్లో తనపై గ్రామ పంచాయతీపై వచ్చిన అసత్య ప్రచారాలను, పుకార్లను సర్పంచ్ షేక్ సిద్దిక్ తీవ్రంగా ఖండించారు. స్వార్థ ప్రయోజనాల కోసం కొంతమంది నిందలు వేస్తున్నారని, నిబంధనలకు కట్టుబడి ప్రభుత్వ ఆస్తులను కాపాడటమే తమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ప్రజాహితం కోసం అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను అడ్డుకోవాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని హెచ్చరించారు.



# మూసాపేట మండలం వేముల గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్

**జడ్ .పి.ఉన్నత పాఠశాల,పల్లె దవాఖాన, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలను ఆకస్మిక తనిఖీ**

**పదో తరగతి విద్యార్థులు నిరంతరం సాధన చేసి గణితంపై పట్టు సాధించాలనీ సూచించిన కలెక్టర్**

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 09:

మూసాపేట మండలం వేముల గ్రామంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్.పి.హెచ్.ఎస్), పల్లె దవాఖాన, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు.మొదట వేముల జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యాబోధన, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాలలోని వసతులు, కొనసాగు తున్న నిర్మాణ పనులు, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. స్టాఫ్ రిజిస్టర్‌ను తనిఖీ



చేసి ఉపాధ్యాయుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, మార్కుల నమోదును పరిశీలించారు. సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, విద్యార్థులకు అందిస్తున్న అక్షయపాత్ర భోజనాన్ని కూడా పరిశీలించారు.పదవ తరగతి క్లాస్ రూమ్ ను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. సిలబస్ ఎంతవరకు పూర్తయింది, పాఠ్యాంశాల పురోగతి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గణితంలోని సూత్రాలు, సమస్యల పరిష్కారంపై విద్యార్థులను ప్రశ్నించి వారి అవగాహనను పరీక్షించారు. గణితంలో మంచి మార్కులు సాధించాలంటే సూత్రాలను కేవలం గుర్తుపెట్టుకోవడం కాకుండా వాటిని క్రమం తప్పకుండా సాధన చేయాలని సూచించారు. సమస్యలను స్వయంగా పరిష్కరిస్తూ గణితంపై పూర్తి పట్టు సాధిస్తే ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించవచ్చని తెలిపారు. పాఠశాల విద్యార్థిని కుమారి మాధురి రచించిన 'శతక మధురిమ' పుస్తకాన్ని కలెక్టర్ పరిశీలించి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల పనితీరును కూడా ప్రశంసించారు. పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైనందున కేటాయించిన నిధులు, వాటి వినియోగం గురించి అధికారులను అడిగి తెలుసుకు న్నారు. సమీపంలోని ఫ్యాక్టరీల యాజమాన్యాల సహకారంతో సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా పాఠశాల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఎదగాలని కలెక్టర్ సూచించారు. పల్లె దవాఖాన తనిఖీ... అనంతరం పల్లె దవాఖానను సందర్శించిన కలెక్టర్ అక్కడికి వచ్చే రోగుల సంఖ్య, సాధారణంగా నమోద వుతున్న అనారోగ్య సమస్యలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు అందిస్తున్న కాల్షియం మాత్రలు, ఇతర మందుల నిల్వలను పరిశీలించారు.గ్రామంలోని స్థానికులతో కూడా కలెక్టర్ మాట్లాడి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, గ్రామ పరిస్థితులు, పాఠశాల పనితీరుపై వివరాలను తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమర్థవంతంగా పనిచేస్తున్నారని స్థానికులు కలెక్టర్‌కు తెలిపారు.

**ప్రాథమిక పాఠశాలను సందర్శన కలెక్టర్**

తదుపరి వేముల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, మెనూ అమలు తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్**

వేముల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం చిన్నారులకు ఆహారం అందిస్తున్నారా లేదా పరిశీలించారు. ఈ రోజు మెనూలో 'ఎగ్ బిర్యానీ' ఉన్నప్పటికీ, బియ్యం వండి దానిపై గుడ్డు వేసి అందించినట్లు గుర్తించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం సిద్ధం చేయకపోవడంపై సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట మండల,గ్రామ అధికారులు ఉన్నారు

# పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

నిర్మల్ సెప్టెంబర్ 09 ( ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని గురువారర్ తానూర్ మండలం భోసి ఉన్నత పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు కాళోజీ నారాయణరావు జీవితం, సాహిత్య ప్రస్థానం, తెలంగాణ భాషా సంస్కృతికి ఆయన చేసిన సేవల గురించి తెలుగు ఉపాధ్యాయులు గణేష్ వివరించారు. కాళోజీ రచనల్లో సామాన్య ప్రజల జీవితం, వారి సమస్యలు, తెలంగాణ యాస, భాష ప్రతిబింబిస్తాయని తెలిపారు. విద్యార్థులు తెలంగాణ భాష గొప్పతనాన్ని చాటుతూ కవితలు, పద్యాలు, ప్రసంగాలు, పాటలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ మాండలిక పదాలతో విద్యార్థులు చేసిన ప్రసంగాలు, ప్రదర్శనలు ప్రత్యేక



ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మాతృభాషను, ప్రాంతీయ భాషా యాసలను గౌరవించి, భావితరాలకు తెలంగాణ భాషా సంస్కృతిని అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జి రాజశేఖర్, సాహ ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, సంజయ్ రావు, సుధాకర్, గణేష్, శ్రీధర్ (పిడి), ధృపత్ రెడ్డి,నీల సృజన నవీన్ కుమార్, రవి, శంకర్, కాశీనాథ్, గజేందర్,లు విద్యార్థులు పాల్గొన్నారు.

# క్లిష్ట గుండె సమస్యతో బాధపడుతున్న 78 ఏళ్ల వృద్ధుడికి టావీ ద్వారా విజయవంతమైన చికిత్స




హనుమకొండ సెప్టెంబర్ 9 ప్రజా కలం ప్రతినిధి

బైకస్పిడ్ అయోర్టిక్ వాల్వ్‌తో పాటు తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్, గణనీయమైన అసెండింగ్ అయోర్టిక్ డైలటేషన్‌తో బాధపడుతున్న 78 పురుష రోగికి ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ (టావీ – TAVI) ద్వారా విజయవంతంగా చికిత్స అందించినట్లు వైద్యులు తెలిపారు.బైకస్పిడ్ అయోర్టిక్ వాల్వ్ అనేది పుట్టుకతో వచ్చే గుండె సంబంధిత లోపం,సాధారణంగా అయోర్టిక్ వాల్వ్‌లో మూడు లీఫ్లెట్లు (కవాటాలు) ఉండగా,ఈ పరిస్థితిలో రెండు మాత్రమే ఉంటాయి. కాలక్రమేణా ఈ అసాధారణ నిర్మాణం కారణంగా వాల్వ్ క్రమంగా ఇరుకుగా మారి తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్‌కు దారితీస్తుందనీ దీంతో గుండెపై అదనపు ఒత్తిడి పడుతుందనీ,ఈ రోగిలో బైకస్పిడ్ అయోర్టిక్ వాల్వ్‌తో పాటు అసెండింగ్ అయోర్టా గణనీయంగా విస్తరించి ఉండటం,అలాగే అయోర్టా అడ్డంగా (హారిజాంటల్‌గా) ఉండటం వల్ల కేసు మరింత క్లిష్టంగా మారిందనీ ఈ సంక్లిష్ట శరీర నిర్మాణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని హార్ట్ టీమ్ సమగ్ర పరిశీలన,అధునాతన ఇమేజింగ్ పరీక్షలు,అత్యంత జాగ్రత్తతో కూడిన ప్రణాళికను రూపొందించిందనీ,రోగి వయస్సు, ఆరోగ్య పరిస్థితి,క్లిష్టమైన శరీర నిర్మాణ లక్షణాలను పరిగణనలోకి తీసుకుని హార్ట్ టీమ్ టావీ విధానాన్ని ఎంచుకుందనీ ఈ అత్యాధునిక, మినిమల్లీ ఇన్వేసివ్ విధానంలో తొడ భాగంలోని రక్తనాళం (ఫెమొరల్ ఆర్టరీ) ద్వారా కొత్త కృత్రిమ వాల్వ్‌ను గుండెకు చేరవేసి,దెబ్బతిన్న అయోర్టిక్ వాల్వ్ స్థానంలో అమర్చారు.ఈ క్లిష్టమైన టావీ ప్రక్రియను సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సంతోష్ మోదాని విజయవంతంగా నిర్వహించారు.ఆయనకు బహుళ విభాగాల కార్డియాక్ బృందానికి చెందిన డాక్టర్ శ్రవణ్ కుమార్ రాంపల్లి,డాక్టర్ షఫీ,డాక్టర్ వాసు సహకారం అందించారు.ఓపెన్-హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.కొత్తగా అమర్చిన వాల్వ్ సమర్థవంతంగా పనిచేస్తుండగా, అయోర్టిక్ వాల్వ్ ద్వారా రక్తప్రసరణ గణనీయంగా మెరుగుపడింది.

చికిత్స అనంతరం రోగి వేగంగా కోలుకుని ప్రస్తుతం ఆరోగ్యంగా, స్థిరమైన పరిస్థితిలో ఉన్నారు.ఈ క్లిష్టమైన కేసు ద్వారా అధునాతన స్ట్రక్చరల్ హార్ట్ ఇంటర్వెన్షన్లు, ఖచ్చితమైన శరీర నిర్మాణ అంచనా, బహుళ విభాగాల హార్ట్ టీమ్ సమన్వయంతో కూడిన వైద్య విధానం ద్వారా సంక్లిష్ట గుండె సమస్యలతో బాధపడుతున్న వృద్ధ రోగులకు సమర్థవంతమైన చికిత్స అందించవచ్చని మరోసారి రుజువైందనీ ముఖ్యంగా వృద్ధుల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శారీరక శ్రమను తట్టుకోలేకపోవడం, ఛాతీ నొప్పి,తల తిరగడం లేదా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు.తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్‌ను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం అత్యంత కీలకమని వారు పేర్కొన్నారు.ఈ విజయవంతమైన ఫలితం సరైన రోగి ఎంపిక,అధునాతన ఇమేజింగ్ సాంకేతికత,ఖచ్చితమైన ప్రణాళిక, అంకితభావంతో పనిచేసిన బహుళ విభాగాల కార్డియాక్ బృందం సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచిందన్నారు.

## ఘనంగా ప్రజా కవి కాళోజీ నారాయణరావు

# జయంతి వేడుకలు

**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ**



నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 09 (ప్రజా కలం): ప్రజా కవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాళోజీ నారాయణరావు తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తూ సమాజంలో చైతన్యం నింపారని పలువురు కొనియాడారు. ప్రజల పక్షాన నిలబడి, సామాజిక అసమానతలు, అన్యాయాలపై తన కలాన్ని ఆయుధంగా మలుచుకున్న మహోన్నత ప్రజాకవిగా కాళోజీ తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజల జీవన విధానానికి కాళోజీ ఎనలేని సేవలు అందించారని, ఆయన రచనలు నేటి తరానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. సమాజంలో మానవీయ విలువలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య చైతన్యం పెంపొందించడంలో కాళోజీ సాహిత్యం కీలక పాత్ర పోషించిందన్నారు. కాళోజీ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు, ఆశలు, ఆకాంక్షలను తన కవిత్వంలో ప్రతిబింబించిన గొప్ప సాహితీవేత్త కాళోజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు బిసి పొలిటికల్ జేఏసీ అరవింద చారి తదితరులు పాల్గొని ప్రజా కవి కాళోజీ నారాయణరావుకు ఘన నివాళులర్పించారు.

# కలెక్టరేట్ లో ఘనంగా కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలు



నిర్మల్ సెప్టెంబర్ 09( ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు బుధవారం కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సాధారణ ప్రజానీకానికి అర్థమయ్యేలా తెలంగాణ యాసలో ఎన్నో కవితలు రచించి, ప్రజలను చైతన్యపరిచిన గొప్ప వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. కాళోజీ సేవలకు కేంద్ర ప్రభుత్వం 1992 లో పద్మ విభూషణ్ అవార్డు ఇచ్చి సత్కరించిందని చెప్పారు. ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాష దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. కాళోజీ లాంటి గొప్ప వ్యక్తుల జయంతులను ఈ విధంగా అధికారికంగా నిర్వహించుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయమని అన్నారు. ఇటువంటి మహనీయుల జయంతి ఉత్సవాల అధికారికంగా నిర్వహించడం ద్వారా భావితరాల వారికి వారి గొప్పతనాన్ని తెలియజెప్పిన వారిమవుతామని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో డిఆర్ఓ రాథోడ్ రమేష్, బిసి, ఎస్సీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, దయానంద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఎల్డిఎం రామ్ గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్వి గ్రామంలో సమైక్య భవన నిర్మాణానికి భూమిపూజ

తానూర్ ,సెప్టెంబర్ 09(ప్రజా కలం): మండలంలోని ఎల్వి గ్రామంలో మహిళా సమాఖ్య అభివృద్ధికి చిహ్నంగా చేపట్టిన సమైక్య భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది,ఈ కార్యక్రమంలో ఏపీడీ నాగవర్ధన్, ఎంపీడీఓ శ్రీధర్, ఏపీఓ, సీసీలు పాల్గొని శంకుస్థాపన చేశారు,సర్పంచ్ ఇర్వంత్ పటేల్, మోహన్ రెడ్డి, చిన్నారెడ్డి, లక్ష్మణ్ పటేల్, వెంకట్ రెడ్డి, పోతారెడ్డి, కృష్ణ, సుదర్శన్ రెడ్డి, భూపారావు, గంగాధర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల నాయకులు ఇందులో పాల్గొన్నారు, భవన నిర్మాణంతో మహిళా సంఘాల కార్యకలాపాలుమరింత వేగవంతమవుతాయనిఅధికారులు పేర్కొన్నారు, గ్రామాభివృద్ధిలో ఇది మరో కీలక ముందడుగు అని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవం




నిర్మల్ సెప్టెంబర్ 09 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ప్రభుత్వ డిగ్రీ కళాశాల భైంసాలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. కె. రఘునాథ్ హాజరై తెలంగాణ భాష, యాస, సంస్కృతి పరిరక్షణలో యువత పాత్ర కీలకమని అన్నారు. తెలంగాణ భాషా వైభవాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. తెలుగు శాఖాధిపతి ఆరే రాజు కాళోజీ నారాయణరావు జీవిత చరిత్ర, సాహిత్య ప్రస్థానం, సామాజిక చైతన్యం, తెలంగాణ ప్రజల సమస్యలపై ఆయన చేసిన పోరాటాన్ని వివరించారు. ప్రజల భాషలోనే ప్రజల సమస్యలను వ్యక్తీకరించిన మహాకవిగా కాళోజీని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన తదితర సాహిత్య పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ భాష, సంస్కృతి, కాళోజీ సాహిత్యంపై తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో హిందీ శాఖాధిపతి డా. పవన్ కుమార్, ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ డా. రవి కుమార్, అధ్యాపకులు డా. ఎం. శంకర్, డా. సంతోష్ కుమార్, డా. ఓం ప్రకాశ్, డా. నహీదా, డా. కల్పన, దివ్య, ఇర్ఫాన్, సురేందర్, ముత్యం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు. బోధనేతర సిబ్బంది కూడా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. "తెలంగాణ భాష మన అస్తిత్వానికి ప్రతీక – దాని పరిరక్షణ మనందరి బాధ్యత" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ
- అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



నిర్మల్ సెప్టెంబర్ 09 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

బుధవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్లో ఎస్ఐఆర్ ప్రక్రియను సీఈవో సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల మేరకు గుర్తించి తొలగించాలని సూచించారు.

బీఎల్ఓల వద్ద ఉన్న దరఖాస్తులు, ఓటర్ల జాబితాలను పరిశీలించిన సీఈఓ, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే నిబంధనల ప్రకారం సరిచేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ప్రతి కుటుంబంలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ధ్రువీకరించిన సమాచారం ఆధారంగానే మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో డాక్యుమెంట్లను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరిస్తున్నామని ఆయన తెలిపారు.

18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఈఓ సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన ప్రతి వివరాన్ని సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి దశలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఎస్ఐఆర్ ప్రక్రియను సీఈవోకి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా దూరమవ్వకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, అనర్హుల పేర్లు కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ విద్యార్థి గర్జన

- కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలులో వైఫల్యంపై బిఆర్ ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా

నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 09 (ప్రజా కలం): రాష్ట్రంలోని విద్యార్థులు నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్‌లో బి ఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం 'నిరుద్యోగ విద్యార్థి గర్జన' పేరుతో భారీ ర్యాలీ ధర్నా నిర్వహించారు. పాత మార్కెట్ యార్డు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగ భృతిని అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని విద్యార్థులు, నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. విద్యానిధి నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హామీ ఇచ్చిన స్కూటీలను కూడా అందించలేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వం సరైన




నిధులు విడుదల చేయడం లేదని మర్రి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగులు తమ హక్కుల సాధన కోసం అప్పటివరకు విరామం లేకుండా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని ప్రజలకు, యువతకు పిలుపునిచ్చారు. మూసి ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం కమిషన్లను దంచుకుంటుందని ఆరోపించారు అసెంబ్లీలో టిఆర్ఎస్ సభ్యుల గొంతు ఒకే ప్రయత్నం జరుగుతుందని విమర్శించారు ధర్నాకు విద్యార్థులు రాకుండా పోలీసులు కళాశాల యాజమాన్యాలకు ఫోన్ చేసి ఒత్తిడి చేశారని ఆరోపించారు నాగర్ కర్నూల్ డిఎస్పి వ్యవహార శైలి పై ఆగ్రహం వ్యక్తం చేశారు తమపై ఎన్ని కేసులు పెట్టిన భయపడేదిలేదని స్పష్టం చేశారు తిరిగి బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు

# జిల్లా కలెక్టరేట్‌లో థలసేమియా అవగాహన సదస్సు నిర్వహణ




మహబూబ్‌నగర్, ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 09

వంశపారంపర్య రక్త సంబంధిత వ్యాధులైన థలసేమియా మరియు సికిల్ సెల్ ఎనీమియాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించే లక్ష్యంతో, వాటి నివారణ, ముందస్తు గుర్తింపు మరియు నిర్వహణపై అవగాహన కల్పించేందుకుమహబూబ్‌నగర్ కలెక్టరేట్ మరియు థలసేమియా ఢ సికిల్ సెల్ సొసైటీ సంయుక్తంగా ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో డా. సుమన్ జైన్ - థలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) చీఫ్ మెడికల్ రీసెర్చ్ ఆఫీసర్ మరియు సెక్రటరీ, శ్రీమతి రత్నావళి - వైస్ ప్రెసిడెంట్ (టీఎస్‌సీఎస్), మరియు డా. పద్మ - సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ (టీఎస్‌సీఎస్) అవగాహన ప్రసంగాలు అందించారు. వారు థలసేమియా మరియు సికిల్ సెల్ ఎనీమియాకు సంబంధించిన వివిధ అంశాలను వివరిస్తూ, అవగాహన మరియు నివారణాత్మక ఆరోగ్య సంరక్షణ పద్ధతుల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. శ్రీనివాసులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. శంకర్ పాల్గొనగా, వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబొరేటరీ టెక్నీషియన్లు (ఎల్‌టీలు), ఎంపీహెచ్ సిబ్బంది, మరియు ఆగ్జిలరీ నర్స్ మిడ్‌వైవ్స్ (ఏఎన్‌ఎంలు) కూడా హాజరయ్యారు. సుమారు 200 మంది పాల్గొనేవారు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని, చర్చల్లో చురుగ్గా పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్య సిబ్బందికి మరియు పాల్గొన్నవారికి థలసేమియా మరియు సికిల్ సెల్ ఎనీమియాపై మెరుగైన అవగాహన లభించడంతో పాటు, సకాలంలో స్క్రీనింగ్, రోగనిర్ధారణ మరియు తగిన సంరక్షణ ప్రాముఖ్యత గురించి తెలియజేయబడింది. జన్యుపరమైన ఈ రక్త సంబంధిత వ్యాధుల ముప్పు ఎక్కువగా ఉన్న సముదాయాలలో ముఖ్యంగా అవగాహనను మరింత బలోపేతం చేయడం, ముందస్తు స్క్రీనింగ్ మరియు సకాలంలో జోక్యాన్ని ప్రోత్సహించడం కొనసాగించాలని పిలుపునిస్తూ కార్యక్రమం ముగిసింది. అదేవిధంగా, హెచ్‌ఐసీసీ, నొవొటెల్ లో అక్టోబర్ 23 నుండి 25, 2026 వరకు జరగనున్న అంతర్జాతీయ GANSID కాంగ్రెస్‌కు హాజరు కావాల్సిందిగా కూడా వారికి తెలియజేయడం జరిగింది.

# పవర్ లిఫ్టింగ్ ప్రపంచ వేదికపై భారత్‌కు పతకమే లక్ష్యం

- భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ రామిరెడ్డి

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, సెప్టెంబర్ 09

అమెరికా పోటీల ఆర్థిక సహాయం కోసం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వీసి ఢయండి సోనీ బాలదేవి కి వినతిపత్రం సమర్పణ అందించాల్సిందిగా తెలంగాణ క్రీడా శాఖకు ప్రతిపాదనలు అందాయి. బుధవారం నాడు ఉదయం గౌరవ పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రివర్యులు శ్రీ వాకిటి శ్రీహరి ని మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం, వారి ఆదేశాలు మరియు ఎండార్స్‌మెంట్ మేరకు హైదరాబాద్ ఎల్.బి. స్టేడియంలోని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వైస్ ఛైర్మన్ ఢ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సోనీ బాలదేవి ని శ్రీ శంకర రావు , వారి కోచ్ శ్రీ జి.వి. రామిరెడ్డి ప్రత్యక్షంగా కలిశారు. మంత్రివర్యులు సిఫార్సు చేసిన ఉత్తర్వుల ప్రతిని విసి ఢ ఎండి కి అందజేసి, రాబోయే అంతర్జాతీయ పోటీల పూర్వాపరాలను, ఇప్పటివరకు సాధించిన జాతీయ రికార్డులను సమగ్రంగా వివరించారు. అర్జీని పరిశీలించిన అధికారులు సానుకూలంగా స్పందించి, తగిన సహాయ సహకారాలు అందిస్తామని అభయమిచ్చారు. అమెరికా వేదికగా వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ వచ్చే అక్టోబర్ 15 నుండి 24 వరకు అమెరికాలోని నెవాడా (రెనో) నగరంలో ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగబోయే "వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్ - 2026" లో మాస్టర్-4 (74 కేజీల విభాగం) లో శ్రీ డి.వి. శంకర రావు గారు భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. శ్రీ శంకర రావు మాటల్లో... "గతంలో సౌత్ ఆఫ్రికా, టర్కీ దేశాల్లో జరిగిన అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనప్పటికీ వివిధ కారణాల వల్ల వెళ్లలేకపోయాను. కానీ ఈసారి ఎలాగైనా అమెరికాలో జరిగే ప్రపంచ పోటీల్లో పాల్గొని మన దేశానికి ఖచ్చితంగా పతకం సాధించాలనే దృఢ సంకల్పంతో ఉన్నాను. ఈ వయసులో మళ్లీ ఇటువంటి అవకాశం రావడం అరుదు. తెలంగాణ ప్రభుత్వం, క్రీడా శాఖ ప్రోత్సాహం అందిస్తే అంతర్జాతీయ వేదికపై భారత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేస్తాను."కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న క్రీడా ప్రోత్సాహకాలు మరియు 'ఖేలో ఇండియా' స్ఫూర్తితో, 74 ఏళ్ల వయసులోనూ అసాధారణ పట్టుదలతో సాధన చేస్తున్న శ్రీ శంకర రావు అభ్యర్థనను మన్నించి, తెలంగాణ ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని క్రీడాభిమానులు కోరుతున్నారు. డివిశంకర్ రావు ఇంటర్నేషనల్ పోటీలకి సెలెక్ట్ అయిన వెంటనే జిమ్ కోచ్ జీవి.రామిరెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఆయన వెంటనే స్పందించి క్రీడా శాఖ మంత్రి అయిన వాకాటి శ్రీహరి ని కల్పించి విషయాలు తెలుపడం జరిగింది. ఆయన దానికి సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి, క్రీడాకారులు లీవి శంకర్రావు పాల్గొన్నారు.



# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. చర్యలు తీసుకోవాలి

- మెట్‌పల్లి సీఐకి జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు ఫిర్యాదు...



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 9 (ప్రజా కలం) బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై అనుచిత, అవమానకర వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మెట్‌పల్లి సీఐకి ఫిర్యాదు చేశారు. ఇటీవల ఓ మీడియా కార్యక్రమంలో ప్రజాప్రతినిధిగా ఉన్న వ్యక్తి కేసీఆర్‌ను ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో పాటు, ఆయనకు హాని కలిగించేలా ప్రజలను ప్రేరేపించే వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ఆధారాలను పోలీసులకు అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, హింసను ప్రేరేపించే వ్యాఖ్యలను సహించరాదన్నారు. ఈ వ్యవహారంపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), 2023లోని వర్తించే నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని పోలీసులను కోరారు. బాధ్యులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రజల భాగస్వామ్యంతో కృషి చేయాలి

- 9వ రాష్ట్రీయ పోషణ్ మాహ్-2026 పోస్టర్‌ను ఆవిష్కరణ - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 09:

జిల్లాలో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రజల భాగస్వామ్యంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో 9వ రాష్ట్రీయ పోషణ్ మాహ్--2026 పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్న పోషణ్ మాహ్ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రజల్లో సామాజిక బాధ్యత, సామూహిక యాజమాన్య భావనను పెంపొందించాలన్నారు.

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన పోషకాహారం అందించడంతో పాటు పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల, ప్రారంభ దశలోనే సరైన పోషణ, మానసిక వికాసానికి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను పోషణ, సంరక్షణ, బాల్య వికాసానికి కీలక వేదికలుగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. "హమారీ అంగన్‌వాడీ, హమారీ జిమ్మేదారీ" (మన అంగన్‌వాడీ.. మన బాధ్యత) అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ ఏడాది పోషణ్ మాహ్ కార్యక్రమాలనునిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆహార వైవిధ్యం, తగినంత ప్రోటీన్ తీసుకోవడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాజా వేడిగా వండిన భోజనం అందించడం, సామాజికయాజమాన్యం-జవాబుదారీతనం, బాల్య వికాసానికి పోషణ-ప్రారంభ ప్రేరణ, ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా తల్లి ఆరోగ్యానికి అందించే నగదు బదిలీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను భాగస్వాములను చేస్తూ పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్.పి.సి.ఈ.ఓ డి. పి.ఓ వెంకటరెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనాబేగం, పోషణ్ కోఆర్డినేటర్, సీనియర్ అసిస్టెంట్ నటరాజు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహాగాంవ్ పాఠశాలలో వైభవంగా తెలంగాణ భాషా దినోత్సవం: కాళోజీ స్ఫూర్తితో ముందుకెళ్లాలి



తానూర్,సెప్టెంబర్ 9(ప్రజా కలం)' మహాగాంవ్ ఉన్నత పాఠశాలలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు తెలంగాణ యాస, భాషల గొప్పదనాన్ని, కాళోజీ జీవిత విశేషాలను మరియు వారి ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ చేసిన పద్యాలు, కవితలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప సర్పంచ్ వరపు కృష్ణమూర్తి మాట్లాడుతూ మన తెలంగాణ యాస, భాషలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు, అనంతరం గడ్డం రాజశేఖర్ మాట్లాడుతూ మాతృభాషలో నైపుణ్యం సాధిస్తేనే జీవిత లక్ష్యాన్ని త్వరగా చేరుకోగలమన్నారు, ప్రధానోపాధ్యాయులు నరాల కనకరాజు మాట్లాడుతూ "దేశభాషలందు తెలుగు లెస్స" అని ఎందరో కవులు, రాజులు కొనియాడారని, పాశ్చాత్యులు సైతం తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని మెచ్చుకున్నారని గుర్తుచేశారు. భాష అనేది ఆ ప్రాంత సంస్కృతీ సాంప్రదాయాలను అందించే జీవన వాహిని అని, తెలుగు భాషను ప్రేమిస్తూనే ఇతర భాషలైన ఇంగ్లీషును కూడా నేర్చుకుంటే జీవితంలో తప్పకుండా రాణిస్తారని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు, ఈ సందర్భంగా తెలుగు భాషా ఉపాధ్యాయులు గంగుల చిన్నన్న రూ. 2,000 విలువైన చూచిరాత పుస్తకాలను విద్యార్థులందరికీ ఉచితంగా అందించగా, విడీసీ ఛైర్మన్ బొలిశెట్టి విశ్వనాథ్ పాఠశాలలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విద్యార్థులకు రూ. 1,000 నగదు బహుమతిని అందించి ప్రోత్సహించారు,అలాగే భైంసా మండల బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్న సబ్బన్ వార్ రాగిణిని పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ అప్పాల లక్ష్మి, విడీసీ కోశాధికారి నాగేష్, ఉపాధ్యాయులు ముత్యంరెడ్డి, విక్రాంతి, శివరాం, శారద, గంగుల చిన్నన్న, వర్ష, చంపత్, గౌరీ మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో పర్యాటక అభివృద్ధికి తగు చర్యలు

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 09:

మహబూబ్ నగర్ జిల్లాలో గుర్తించిన పర్యాటక ప్రాంతాలలో పర్యాటక అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. కోయిల్ కొండ మండలం రాం కొండ ను బెస్ట్ టూరిజం గ్రామం కింద ఫిల్మ్ షూటింగ్ కొరకు అభివృద్ధి ప్రతి పాదనలు,జడ్చర్ల లో హెరిటేజ్ ,టూరిజం ప్లాజా లను ఏర్పాటుకు పి.పి.పి విధానంలో ప్రతి పాదనలు పంపనున్నట్లు రాష్ట్ర శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్ కు తెలియజేశారు. బుధవారం పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లు, టూరిజం అధికారులతో పర్యాటక అభివృద్ధి, ఫైవ్ స్టార్ హోటళ్ల నిర్మాణం, పర్యాటక ప్రాంతాల వద్ద సౌకర్యాల ఏర్పాటు, సి ఎస్ ఆర్ నిధుల సమీకరణ,జిల్లాలలో మూడంచల టూరిజం అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక ,తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో టూరిజం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్ వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో టూరిజం ప్రాంతాల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, తెలిపారు జిల్లాలో ఈనెల 26న ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పర్యాటక ప్రదేశాల సందర్శన,వ్యాస రచన,వకృత్వం,పెయింటింగ్ తదితర పోటీ లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

. జిల్లాలో జ్ఞాన్ భారతం నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,టూరిజం నోడల్ అధికారిగా క్రిస్టినా లను నామినేట్ చేసినట్లు తెలిపారు.

టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, కల్చర్, హెరిటేజ్ డైరెక్టర్లు రాష్ట్రస్థాయి నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరుకాగా, జిల్లా నుండి జిల్లా కలెక్టర్ తో పాటు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా టూరిజం అధికారి రాజశేఖర్ రెడ్డి, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### – సెప్టెంబర్ 10 న జరిగే మహాధర్నాకు తరలిరావాలి

### – ప్రభుత్వ తీరుపై రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య ఆగ్రహం

సెప్టెంబర్ 9 హనుమకొండ:
(ప్రజా కలం ప్రతినిధి)

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులు, పొరుగు సేవలు, ఒప్పంద ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల నాన్ గెజిటెడ్ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న నిర్వహించనున్న మహాధర్నాకు ఉద్యోగులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కేవలం ఐదు శాతం మధ్యంతర భృతి ప్రకటించి వెళ్లగా, ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పట్ల మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులను తమ న్యాయమైన హక్కుల కోసం రోడ్డెక్కి ధర్నాలు చేసే పరిస్థితికి ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు.



**ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు ఇవే..**

2024 జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలి. 2023 జూలై 1 నుంచి రెండో వేతన సవరణ సంఘం సిఫారసులను కనీసం 45 శాతం అమలు చేసి, బకాయిలను ఒకేసారి చెల్లించాలి.

మూడో వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలి.

గతంలో పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిలను విడుదల చేయాలి.

సాధారణ భవిష్య నిధి రుణాలు తీసుకున్న ఉద్యోగుల ఖాతాల్లో వెంటనే నగదు జమ చేయాలి.

పదవీ విరమణ చేసిన ఉద్యోగుల అన్ని ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలి.

ఈ-కుబేర్ విధానాన్ని రద్దు చేసి, ఖజానా శాఖ ద్వారా వేతనాలు, ఇతర బిల్లులు చెల్లించాలి.

ఉద్యోగుల ఆరోగ్య పథకంలోని లోపాలను సరిచేసి కార్పొరేట్ ఆసుపత్రుల్లోనే వైద్య సేవలు అందించాలి. చికిత్స పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలి.

25 సంవత్సరాలు దాటిన కుమారులకు వివాహం జరిగే వరకు ఆరోగ్య పథకం కింద వైద్య సేవలు కొనసాగించాలి.

ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి.

వాటా ఆధారిత పింఛన్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి.

60 సంవత్సరాలు దాటిన గ్రామ రెవెన్యూ సహాయకుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలి.

మరణించిన గ్రామ సేవకుల వారసులను వెంటనే గ్రామ సేవకులుగా నియమించాలి.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కారం చూపాలని మల్లయ్య కోరారు. ప్రభుత్వం ఇదే మొండివైఖరిని కొనసాగిస్తే ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమించి తమ హక్కులను సాధించుకుంటామని హెచ్చరించారు. ఉద్యోగులు, వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ఒక్కరోజు సెలవు పెట్టుకుని అయినా సెప్టెంబర్ 10న జరిగే మహాధర్నాకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

# మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలి

### మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ – జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 09:

వినాయక చవితి సందర్భంగా ప్రజలు మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వివిధ శాఖల అధికారులకు, ఉద్యోగులు, సిబ్బందికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూపర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు, రసాయనాలతో కూడిన రంగుల వినియోగం వల్ల నీటి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందన్నారు. తద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని ఆమె సూచించారు. ముందుగా కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన "మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే పోస్టర్ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డి.ఆర్.ఓ. ఎ. నిర్మల, ఆర్.డి.ఓ. నవీన్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులుతో పాటు పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

### విద్యార్థులు మాదకద్రవ్యాలు సైబన్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి – డి ఎల్ ఎస్ ఏ కార్యదర్శి నిహారిక



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 09 (ప్రజా కులం ): తీరాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ) నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో బుధవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి నిహారిక హాజరై మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ న్యాయ సేవల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైన దశ అని ప్రతి విద్యార్థి జీవితంలో ఒక గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్య సాధనకు అనుగుణంగా కష్టపడి చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని ఆమె కోరారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తి జీవితంతో పాటు కుటుంబ వ్యవస్థ కూడా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఎస్ఐ గిరి మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మనం అలసత్వంగా వ్యవహరిస్తే సైబర్ నేరగాళ్లు మనకు తెలియకుండానే వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే అవకాశం ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ లావాదేవీల వినియోగంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య మాట్లాడుతూ ముఖ్యంగా మైనర్ బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టడంలో పోక్సో చట్టం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. బాలికలు తమకు ఎలాంటి సమస్యలు ఎదురైనా భయపడకుండా షీ టీమ్‌కు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం పొందేందుకు టోల్ ఫ్రీ నెంబర్లకు సంప్రదించవచ్చని సూచించారు

# వర్షాల కోసం బొడ్రాయిలకు ప్రత్యేక పూజలు

### – బొడ్రాయి సెంటర్లో మహిళలు ,రైతులు ప్రత్యేక పూజలు

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 9, ప్రజాకలం

మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలు కురవాలని కోరుతూ బుధవారం మహిళలు, రైతులు గ్రామ దేవతలైన బొడ్రాయిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆళ్లపల్లి గ్రామాల్లోని బొడ్రాయి సెంటర్ వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకుని వరుణ దేవుడిని వేడుకుంటూ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. కొంతకాలంగా ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో బోర్లలో నీరు అడుగంటిపోతోందని, దీంతో పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురిస్తేనే పంటలు చేతికొచ్చే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దల పిలుపు మేరకు మహిళలు, రైతులు కలిసి బొడ్రాయి సెంటర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బొడ్రాయిలకు జలాభిషేకం చేసి, పసుపు, కుంకుమలతో అలంకరించారు. అనంతరం పూలతో పూజలు చేసి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. వరుణ దేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, చెరువులు, కుంటలు, బోర్లలో నీరు సమృద్ధిగా ఉండాలని, పంటలు బాగా పండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో గ్రామ దేవతలను వేడుకుని పూజలు నిర్వహించడం ద్వారా వర్షాలు కురిసి తమ పంటలు కాపాడాలని మహిళలు, రైతులు ఆకాంక్షించారు.



బొడ్రాయి సెంటర్ వద్ద జరిగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు నరేడ్ల రత్నాలు, కందిమల్ల స్వరూప, పద్మా, నరేడ్ల ప్రశాంతి,విజయ,స్వరూప గుంతోజు విజయలక్ష్మి,స్వరస్వతి, సుధా, భవాని, ఉమాదేవి, రమణ,భవాని,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విద్యుత్ సమస్యకు

# స్పందించి తక్షణ పరిష్కారం

### – మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 09 (ప్రజా కలం): నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతంలో నెలకొన్న విద్యుత్ సమస్యను మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ తక్షణమే స్పందించి పరిష్కారం చూపించారు. పట్టణంలోని 16వ వార్డు పరిధిలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో విద్యుత్ సమస్య ఉందని గుర్తించిన చైర్మన్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టారు. ఆసుపత్రి పరిసర ప్రాంతంలోని విద్యుత్ స్తంభాలకు అవసరమైన విద్యుత్ వైర్లను ఏర్పాటు చేయించి కరెంట్ సమస్యను పరిష్కరించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం చికిత్స కోసం వచ్చే రోగులు వారి సహాయకులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది మరియు మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో సమస్యను ఖత్వరితగతిన పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్



వైస్ చైర్మన్ బాదం రమేష్, కాంగ్రెస్ నాయకులు ఖాజకాన్, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను గుర్తించిన వెంటనే స్పందించి పరిష్కారం చూపడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.

# సర్పంచుల సీటులో భర్తలేనా?



గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 9 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండల ప్రత్యేక అధికారి జగ్గు నాయక్ హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశంలో పలు గ్రామాలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొంతమంది మహిళా సర్పంచులు సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడంతో వారి బదులు వారి భర్తలు సమావేశానికి హాజరై గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, విద్యుత్, ఉపాధి హామీ, విద్య, రహదారులు, హౌసింగ్, పారిశుద్ధ్యం తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి జగ్గు నాయక్ సూచించారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మహిళా సర్పంచులు ప్రజలచే ఎన్నికైన సర్పంచులుగా మండల సర్వసభ్య సమావేశాలకు స్వయంగా హాజరై తమ గ్రామాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. మహిళా సర్పంచులు సమావేశాల్లో చురుకుగా పాల్గొంటే గ్రామ సమస్యల పరిష్కారంతో పాటు మహిళా సర్పంచుల భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

# సర్వసభ్యలో సమస్యల సెగ.. వాడీవేడిగా సభ!

గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 9 (ప్రజా కలం):

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి మండల స్థాయి అధికారులు, సర్పంచులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**ఎల్కూర్‌లో లో-వోల్టేజీ సమస్య**

ఎల్కూర్ గ్రామ సర్పంచ్ పి. వినోద్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామంలోని 8వ వార్డులో తీవ్ర లో-వోల్టేజీ సమస్య ఉందని తెలిపారు. విద్యుత్ వైర్లు, స్తంభాలు సరిపడా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను ఇప్పటికే విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. వెంటనే అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

**కుర్తిరావుల చెరువులోనూ లో-వోల్టేజీ**

కుర్తిరావుల చెరువు సర్పంచ్ కె. భగవంత్ మాట్లాడుతూ..



గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో లో-వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీంతో ఇళ్లలో ఫ్యాన్లు, లైట్లు సరిగా పనిచేయడం లేదని తెలిపారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

సర్వసభ్య సమావేశంలో విద్యుత్, తాగునీరు, రహదారులు, గ్రామీణ మౌలిక వసతులకు సంబంధించిన పలు సమస్యలపై సర్పంచులు చర్చించారు. ఆయా సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు.

# ఫిజియోథెరపీతో శాశ్వత ఆరోగ్యం సాధ్యం

### లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపిస్టు డాక్టర్ సుమంత్ కు ఘన సన్మానం




నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 09 (ప్రజా కలం): ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సుమంత్‌ను లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ శాలువ మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఫిజియోథెరపీ ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. ఆధునిక జీవనశైలి కారణంగా యువతలో చిన్న వయసులోనే నడుము, మెడ, కీళ్ల నొప్పులు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గంటల తరబడి సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల వినియోగం చేయడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలే ఇందుకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. అనేక రకాల నొప్పులకు మందులు, శస్త్రచికిత్సలపై మాత్రమే ఆధారపడకుండా, వైద్య నిపుణుల సూచనల మేరకు ఫిజియోథెరపీ వ్యాయామాలు చేయడం ద్వారా ఉపశమనం పొందవచ్చని తెలిపారు. నాగర్‌కర్నూల్ ప్రజలకు ఫిజియోథెరపిస్టు డాక్టర్ సుమంత్ అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలు అభినందనీయమని ప్రశంసించారు. డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్, కంప్యూటర్ వినియోగించే సమయంలో సరైన భంగిమలో కూర్చోవడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. చిన్న వయసులోనే ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే క్రమబద్ధమైన వ్యాయామం, సరైన జీవనశైలిని పాటించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జోన్ చైర్మన్ కైలాష్ జవర్, షిరిడీ సాయి పారా మెడికల్ కళాశాల సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషను పరిరక్షించుకోవాలి




### -మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి

(వరంగల్/ పర్వతగిరి) సెప్టెంబర్ 09, ప్రజాకలం ప్రతినిధి:

కాళోజీ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొంకపాక లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పర్వతగిరి మండల విద్యాధికారి అల్లందాస్ బిక్షపతి అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ, తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తూ మాతృ భాషను ఎప్పుడూ మనం నిర్లక్ష్యం చేయవద్దని విద్యార్థులు అక్షర దోషాలు లేకుండా రాయడం, తప్పుల్లేకుండా చదవడం, అనే సామర్థ్యాలను పెంపొందించుకోవాలని మన తెలంగాణ భాష, యాసను, మన సంస్కృతిని పరిరక్షించుకోవాలని కోరారు. కాళోజి గురించి అతని గొప్పదనం గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయులు డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు కాళోజి జీవితం, సాహిత్యం, తెలంగాణ భాష , యాస గొప్పతనం గురించి సుదీర్ఘంగా తన ఉపన్యాసంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు జే. లింగమూర్తి, ఎం. విశ్వనాథ శర్మ, వెనిశెట్టి కృష్ణమూర్తి, ఎండి హాఫీజ్, ఇన్స్ట్రక్టర్ లలిత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు.

# గుంతలమయంగా ఎల్కూర్-తూముకుంట రహదారి

## 20 ఏళ్లుగా రోడ్డు సమస్య.. పట్టించుకోని అధికారులు



గద్వాల ప్రతినిధి సెప్టెంబర్ 9 ప్రజా కలం

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని ఎల్కూర్, మల్లెం దొడ్డి, విఠలాపురం, చిప్పదొడ్డి, ఐజ మండలం తూముకుంట శివారు వరకు ఉన్న రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విఠలాపురం సర్పంచ్ సులోంతమ్మ తెలిపారు. గత 20 ఏళ్లుగా రహదారి సరిగా లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మతులు చేపట్టి కొత్త రహదారి నిర్మించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. వర్షాకాలంలో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలవడంతో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎల్కూర్ నుంచి తూముకుంట శివారు వరకు రహదారిని నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని సర్పంచ్ సులోంతమ్మ కోరారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 09:

మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల్లో చైతన్యం, స్ఫూర్తిని నింపడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు . తన కవిత్వం, రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారని గుర్తుచేశారు. కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో , అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి నిర్మల, ఎ.ఓ సువర్ణ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీపై అత్యాచారయత్నం

## – నిందితుడుపై కేసు నమోదు రిమాండ్ కు తరలింపు

## – మరిపెడ ఎస్ హెచ్ ఓ గండ్రాతి సతీష్

మరిపెడ ప్రతినిధి ప్రజాకలం న్యూస్ సెప్టెంబర్ 9 అత్యాచారయత్న కేసులో నిందితుడు అరెస్ట్ అయిన ఘటన మరిపెడ మండలం ఎలమంచిలి తండా గ్రామం ఇటికలగడ్డ తండాలో చోటుచేసుకుంది ఈ సందర్భంగా ఓ మీడియా సమావేశంలో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇటికలగడ్డ తండాకు చెందిన వివాహిత మహిళ పై గత మూడు నెలల క్రితం వ్యవసాయ పనుల నిమిత్తం చేను కాడికి వెళ్తున్న క్రమంలో అత్యాచార యత్నానికి పాల్పడినట్టు తెలిపారు నిందితుడు అదే తండాకు చెందిన భూక్యా బాలు. ం /శీ లచ్చపతి, 40 సంవత్సరాలు, లంబాడా, గా గుర్తించారు ఆ వ్యక్తిని ఈరోజు అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించడం జరిగినది తెలిపారు

# ఎక్సైజ్ టాస్క్ పోర్స్ దాడులు

## 12 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం

## మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టివేత..ద్విచక్ర వాహనం సీజ్

నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 09 ప్రజాకలం (ప్రతినిధి): అక్రమ మద్యం రవాణా



విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు నాగర్‌కర్నూల్ జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు కల్వకుర్తి మండలం తర్నికల్ తండా సమీపంలో దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. గ్రామ శివార్లలో అక్రమంగా మద్యం విక్రయించేందుకు ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న ముడవత్ లక్ష్మణ్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు 12 లీటర్ల అక్రమ మద్యంను స్వాధీనం చేసుకోవడంతో పాటు మద్యం రవాణాకు ఉపయోగించిన ద్వీచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. పట్టుబడిన నిందితుడిని తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల నిమిత్తం కల్వకుర్తి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారి నాగార్జున రెడ్డి తెలిపారు. జిల్లాలో అక్రమ మద్యం రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ టాస్క్ పోర్స్ అధికారులు వాసురామ్ నాయక్ శ్రీనివాస్ నాయక్ అనూష తదితరులు పాల్గొన్నారు

# నర్సింహులగూడెంలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

సెప్టెంబర్ 9:ఐనవోలు:– (ప్రజాకలం ప్రతినిధి) ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను నర్సింహులగూడెం గ్రామంలో సర్పంచ్ పోలేపల్లి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శంకర్ రెడ్డి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ భాష, యాస, సంస్కృతి పరిరక్షణతో పాటు ప్రజా సమస్యలపై తన రచనల ద్వారా కాళోజీ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని సర్పంచ్ శంకర్‌రెడ్డి, గ్రామస్తులు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్‌హొవార్డ్ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# న్యూ శాయంపేటలో నేడు చివరి శ్రావణ పోచమ్మ బోనం



న్యూ శాయంపేట సెప్టెంబర్ 10 ప్రజా కలం ప్రతినిధి

శ్రావణ మాస చివరి గురువారం సందర్భంగా నేడు( సెప్టెంబర్ 10)న్యూ శాయంపేటలో చివరి పోచమ్మ బోనం వైభవంగా ఎత్తుకోనున్నారు.న్యూ శాయంపేటకు పెద్ద పండుగగా భావించే ఈ పోచమ్మ బోనాల పండుగ ప్రతి ఏటా శ్రావణ మాస చివరి గురువారం నాడు జరుపుకోవడం ఇక్కడి ప్రత్యేకత. ఈ సందర్భంగా 31వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు డివిజన్ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మామిండ్ల రాజు మాట్లాడుతూ...''పండుగలు వస్తుంటాయి, పోతుంటాయి.కానీ న్యూ శాయంపేట ప్రత్యేకత పోచమ్మ తల్లి బోనాల వేడుకలు. ఇక్కడ ప్రతి కుటుంబం భక్తిశ్రద్ధలతో బోనం ఎత్తుకొని అమ్మవారి ఆశీర్వాదం పొందుతారు. అమ్మవారి కృపా కటాక్షాలు ఎల్లవేళలా అందరిపై ఉండాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.ఈ ఆలయంలో కుమ్మర కులస్తులు అర్చకులుగా తరతరాలుగా వస్తున్న ఆచారం ఎంతో విశిష్టమైనదని ఆయన తెలిపారు. ఉదయం 6 గంటల నుండి అర్థ రాత్రి 1 వరకు ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయని, వేడుకకు విచ్చేస్తున్న భక్తులకు, అతిథులకు శుభాకాంక్షలు తెలిపారు.

**ఎంపీ కడియం కావ్య కు,**

**ఎ సి పిడసిఐ లకు ఆహ్వాన పత్రిక**

వరంగల్ ఎంపీ,కడియం కావ్య,హనుమకొండ ఎసిపి నరసింహారావు,సుబేదారి సిఐ రంజిత్ రావులకు పోచమ్మ ఆహ్వాన పత్రికను మాజీ కార్పొరేటర్ అందజేశారు.వేలాది మంది వచ్చే భక్తులకు..బందోబస్తును ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చూడాలని ఆయన కోరారు.

# రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి:

## – జాయింట్ కలెక్టర్‌కు వినతి





హనుమకొండ సెప్టెంబర్ 9 ప్రజా కలం ప్రతినిధి

రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వరంగల్ జిల్లా,హనుమకొండ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిల్లర్లు కలెక్టర్ లకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ధాన్యం సేకరణ,మిల్లింగ్ ప్రక్రియకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు.మిల్లింగ్ సమయంలో డ్యామేజ్,నూకలు తదితర కారణాలతో ఏర్పడే షార్ట్‌ఫాల్‌పై మిల్లర్లపై చర్యలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.అలాగే రబీ 2025–26 సీజన్‌కు సంబంధించిన బాయిల్డ్ రైస్, రా రైస్ డెలివరీ సమస్యలను పరిష్కరించాలని,నా=, టెస్ట్ మిల్లింగ్‌కు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని గత సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్,డ్రెయిజ్,కస్టోడియన్, రవాణా చార్జీలను కూడా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించి, త్వరితగతిన పరిష్కారం చూపాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ ఆందోళనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో హనుమకొండలో కలెక్టర్,జాయింట్ కలెక్టర్‌కు ఈ వినతిపత్రం ఇచ్చామని పేర్కొన్నారు.

# తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీ ఎన్నిక







ఖమ్మం, సెప్టెంబర్ 09(ప్రజా కలం న్యూస్ )

తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు బుధవారం ఖమ్మం కలెక్టర్ ప్రాంగణంలో ఖమ్మం జిల్లా సాంస్కృతిక సారథి కళాకారుల నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఖమ్మం జిల్లా అధ్యక్షులుగాపాగి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా బొమ్మెర ముత్యం, కోశాధికారిగా చాపలమడుగు కోటేశ్వరరావు లు ఓటింగ్ ద్వారా గెలుపొందారు. ఈ ఎన్నికలో ఖమ్మం జిల్లాలోని 22 మంది తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొని ఓటు వేయడం జరిగింది. గౌరవాధ్యక్షులుగా మునగాల వెంకటరత్నం, గౌరవ సలహాదారులుగా పమ్మి రవి, మిమిక్రీ సుధాకర్, కాల్వకట్ట జాన్, మేడ ముత్తయ్య, ఉపాధ్యక్షులుగా పరకాల అజయ్, కొమ్ము రమేష్, మిమిక్రీ భద్ర, సహాయ కార్యదర్శిగా వెంకట్ నకిరేకంటి, మాచర్ల కృష్ణ, పిడియాల లక్ష్మణ్, ప్రచార కార్యదర్శిగా గోవింద గురవయ్య, మహిళా ప్రతినిధులుగా ఎంగల కుమారి, బీరెల్లి రమణ, కొండ్రు జ్యోతి, ముత్తమాల సునీత, కార్యవర్గ సభ్యులుగా బానోత్ రవిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# మోత్య తండా గ్రామ సమస్యల పరిష్కారానికి అడిషనల్ కలెక్టర్ కి సర్పంచ్ భూక్య నరేష్ వినతి



(వరంగల్/పర్వతగిరి) సెప్టెంబర్ 09 ప్రజాకలం ప్రతినిధి:

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మోత్య తండా గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ భూక్య నరేష్ జిల్లా అడిషనల్ కలెక్టర్ కి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన రెండు ముఖ్యమైన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

**రావూర్ ఊరు చెరువు సమగ్ర సర్వే నివేదిక**

ఉమ్మడి రావూర్ గ్రామంలోని (మోత్య తండా పరిధి) ఊరు చెరువు యొక్క అసలు సరిహద్దులు, పాత నక్షా, విస్తీర్ణానికి సంబంధించి స్పష్టమైన వివరాలు అవసరమున్నాయి. రెవెన్యూ, సర్వే అధికారుల ద్వారా చెరువు భూములు, శిఖం భూములు, ప్రభుత్వం నమోదిత సర్వే నంబర్ల ఆధారంగా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలి. పాత నక్షా/మ్యాప్ ప్రతులను పరిశీలించి, చెరువు నాలుగు వైపులా అసలు సరిహద్దులు, విస్తీర్ణాన్ని అధికారికంగా నిర్ధారించాలని కోరారు.

**మోత్య తండా ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీ**

మోత్య తండా గ్రామ పంచాయతీలో సుమారు 1500 పైగా జనాభా ఉన్నారు. గ్రామంలో ప్రత్యేకంగా డీలర్ షాపు లేకపోవడంతో ప్రజలు రేషన్ సరుకుల కోసం పొరుగున ఉన్న రావూర్ గ్రామానికి వెళ్లి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గ్రామస్థుల సౌకర్యార్థం రావూర్ లోని రేషన్ డీలర్ స్వయంగా మోత్య తండా గ్రామానికి వచ్చి రేషన్ సరుకులు అందజేసేలా లేదా తండాలోనే సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత తహసీల్దార్, రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించి ఈ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని సర్పంచ్ భూక్య నరేష్ ఉన్నత అధికారులకు సవినయంగా మనవి చేశారు.

# విహార యాత్రకు తరలి వెళ్లిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు..




వెల్గటూర్, సెప్టెంబర్ 9, ప్రజాకలం, ప్రతినిధి : జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాలకు సంబంధించిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు, జగిత్యాల జిల్లా కలెక్టర్, జగిత్యాల జిల్లా విద్యాధికారి రాము అనుమతితో హైదరాబాద్ విహారయాత్రకు తరలివెళ్లి, వివిధ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ జూలాజికల్ పార్క్, రాష్ట్ర సచివాలయం, అక్కడే ఉన్న అంబేద్కర్ విగ్రహం పరివాహక ప్రాంతం, లుంబిని పార్క్, సాలర్ జంగ్ మ్యూజియం వంటి ప్రాంతాలను సందర్శించారు. పలు ప్రాంతాలను సందర్శించిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు రోజంత ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల సమన్వయకర్త కోరుట్ల మహేష్, ప్రత్యేక అధికారులు, మండల ఎల్‌ఈఆర్పీలు పాల్గొన్నారు

# ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ






హనుమకొండ సెప్టెంబర్ 9 ప్రజా కలం ప్రతినిధి

క్రెడాయ్ వరంగల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 11న నిర్వహించనున్న "ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026, ఎడిషన్–2" పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి యువ నాయకుడు విష్ణు వర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు.అనంతరం పోలీస్ కమిషనర్ శ్వేత,ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మారథాన్ వివరాలను తెలియజేశారు.కాళోజీ కళాక్షేత్రం గ్రౌండ్స్ నుంచి ప్రారంభమయ్యే ఈ మారథాన్‌లో 21.1 కి.మీ హాఫ్ మారథాన్‌తో పాటు 10,5 కి.మీ రన్స్ నిర్వహించనున్నారు.యువతలో ఆరోగ్యం,ఫిట్‌నెస్‌తో పాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి వేడుకలు



ఐనవోలు, సెప్టెంబర్ 9:–(ప్రజా కలం ప్రతినిధి)ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఐనవోలు మండల కేంద్రంలో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అయినవోలు గ్రామ సర్పంచ్ గడ్డం రఘువంశి గౌడ్ మరియు వార్డు సభ్యులు, నాయకులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రఘు వంశీ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ఉద్యమంతో పాటు తెలుగు భాష, యాస, సంస్కృతి పరిరక్షణకు కాళోజీ నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కాళోజీ రచనలు, ఆయన ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బరిగేల భాస్కర్ వార్డు సభ్యులు తాటికాయల సుజాత కుమారస్వామి శాతాల కుమారస్వామి కొత్తూరి అనిల్ కుమార్ దుపెల్లి రాజు రంగు శ్రీనివాస్ గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట కిషోర్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో రూ.85 లక్షల మోసం.. వ్యక్తి అరెస్ట్




కాజీపేట/హనుమకొండ సెప్టెంబర్9 ప్రజా కలం ప్రతినిధి

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగ యువత నుంచి భారీగా డబ్బులు,బంగారం వసూలు చేసిన మెట్టు ప్రవీణ్ కుమార్ (41)ను కాజీపేట పోలీసులు అరెస్ట్ చేశారు. Sports Quota, NCC Quota, Backdoor Recruitment పేర్లతో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి సుమారు రూ.85 లక్షల నగదు,4 తులాల బంగారం వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు.నకిలీ Appointment Orders, Memorandums చూపించడంతో పాటు మెడికల్ టెస్టులు,పోలీస్ వెరిఫికేషన్ పేరుతో నమ్మించినట్లు వెల్లడించారు.నిందితుడి వద్ద నుంచి రూ.18.22 లక్షల విలువైన నగదు, కారు,ల్యాప్‌టాప్,మొబైల్ ఫోన్లు, బాధితుల అసలు సర్టిఫికెట్లు, నకిలీ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కేసుపై పోలీసులు మరింత దర్యాప్తు చేస్తున్నారు.

# మృతుని పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన బీఆర్ఎస్ నాయకులు

(వరంగల్/ పర్వతగిరి) సెప్టెంబర్ 09 ప్రజాకలం ప్రతినిధి: పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన మడ్డి కుమారస్వామి గౌడ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొని బుధవారం వారి స్వగృహానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి నివాళులర్పించి, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు బరిగేల విజయ, గ్రామ మాజీ సర్పంచ్ బొట్ల కిష్టయ్య, వార్డు సభ్యురాలు చిన్నపెల్లి విజయ్, నాయకులు రంగు కుమార్ గౌడ్ (ఫర్టిలైజర్), ప్రముఖ కళాకారులు బరిగేల వెంకటేశ్వర్లు, గౌడ్ సంఘం అధ్యక్షులు పుల్లూరి సారయ్య గౌడ్, మండల సోషల్ మీడియా చిన్నపెల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచుల ఫైర్.. అధికారులకు ప్రత్యేక అధికారి క్లాస్

### మండల ప్రత్యేక అధికారి జగ్గు నాయక్



గద్వాల ప్రతినిధి సెప్టెంబర్ 9 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి జగ్గు నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సర్పంచులు అధికారులను ప్రశ్నించారు. విద్యుత్, ఉపాధి హామీ పథకం, తాగునీరు, విద్య, హౌసింగ్ తదితర అంశాలపై సర్పంచులు ప్రశ్నలు సంధించి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి జగ్గు నాయక్ ఆదేశించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఝాన్సీ రాణి, మండల వ్యవసాయ శాఖ అధికారి కే రాజశేఖర్, ఎంఈఓ జి.సురేష్, సమావేశంలో 13 శాఖలకు చెందిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

## మల్దకల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు

### అండర్-14, అండర్-17 బాలబాలికలకు అవకాశం

గద్వాల ప్రతినిధి సెప్టెంబర్ 9 (ప్రజా కలం): మల్దకల్ మండల పరిధిలోని పాఠశాల విద్యార్థులకు ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి జి. సురేష్ తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీ, గురుకుల పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు క్రీడా పోటీల వివరాలను విద్యార్థులకు తెలియజేసి, ప్రతిభ కలిగిన క్రీడాకారులను పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. మల్దకల్ మండల ఎస్‌జీఎఫ్ కన్వీనర్‌గా ఫిజికల్ డైరెక్టర్ సుహాసిని వ్యవహరిస్తారని ఎంఈఓ జి. సురేష్ తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు తదుపరి స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## గణేష్ విగ్రహ ప్రతిష్టాపనకు అనుమతి తప్పనిసరి

### ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఇంటిమేషన్ సర్టిఫికెట్ స్టేషన్ లో ఇవ్వాలి

### కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్



మల్హర్, సెప్టెంబర్ 9 ప్రజాకలం ప్రతినిధి...

వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహాన్ని ప్రతిష్ఠించదలచిన నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ ఇంటిమేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ప్రతిష్ఠాపన తేదీ, నిమజ్జనం తదితర వివరాలను దరఖాస్తులో నమోదు చేయాలని తెలిపారు. అదేవిధంగా నిర్వాహకుల పూర్తి వివరాలు, సంప్రదింపు మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా అందించాలని సూచించారు. పోలీస్ శాఖ సూచించే శాంతిభద్రతలు, ట్రాఫిక్‌తో పాటు ఇతర నిబంధనలను పాటించాలని, గణేష్ ఉత్సవ నిర్వాహకులు నిర్ణీత సమయంలో ఇంటిమేషన్ దరఖాస్తు సమర్పించుకోవాలని ఎస్ఐ కోరారు.

## ఉప సర్పంచుల చెక్ పవర్ ఎందుకు?

### మల్హర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ డిమాండ్

మల్హర్, సెప్టెంబర్ 9 ప్రజాకలం ప్రతినిధి

భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా సర్పంచుల సమావేశంలో ఉప సర్పంచుల చెక్ పవర్‌ను రద్దు చేయాలని మలహర్రావు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కొండ రాజమ్మ డిమాండ్ చేశారు. సర్పంచులకు పూర్తి అధికారాలు కల్పించి, గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్, పెద్దతుండ్ల సర్పంచ్ బండారి నరసింగరావు, రుద్రారం సర్పంచ్ చంద్రగిరి సంపత్, తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి, కొండంపేట సర్పంచ్ బెల్లంకొండ జోష్ణ, షరీన్ రావు, మల్లారం సర్పంచ్ మేకల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

### -నిరుద్యోగ యువతకు కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమీషనర్ సాయి చైతన్య పిలుపు

### పోలీస్ ఉద్యోగార్థుల ప్రీ రిక్రూట్ మెంట్ శిక్షణ శిబిరం సందర్శన




నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 09:

పోలీసు శాఖలో పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన దృష్ట్యా నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. పోలీస్ శాఖలో ఎస్.ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులలో సుమారు 200 మందిని ఎంపిక చేసి, జిల్లా యంత్రాంగం తోడ్పాటుతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రీ-రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ఏర్పాటు చేశారు. ఉద్యోగార్థులకు భోజన వసతిని సమకూ రుస్తూ రెండు నెలల పాటు నిష్ణాతులచే థియరీ, దేహదారుఢ్య పరీక్షలలో ఉత్తమ ప్రతిభ చాటేలా శిక్షణ అందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన భాగ్యకిరణ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, నిపుణులచే అభ్యర్థులకు మెళకువలు నేర్పిస్తూ, అన్ని విధాలుగా సన్నద్ధం చేసేలా చర్యలు తీసుకున్నారు.

జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో కొనసాగుతున్న ప్రీ రిక్రూట్ మెంట్ శిక్షణ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యతో కలిసి కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా అభ్యర్థులకు విలువైన సలహాలు, సూచనలు అందించారు. రీజనింగ్ ఎబిలిటీ, ఆంగ్లం, గణితం అంశాలలో ఎక్కువ మార్కులు సాధించడానికి పాటించాల్సిన పద్ధతుల గురించి మెళకువలు తెలియజేశారు. ఉద్యోగార్థులకు తానే స్వయంగా నైపుణ్య సామర్థ్య పరీక్షలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగాలకు విపరీతమైన పోటీ నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో ఏకాగ్రత, పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తేనే కొలువు సాధించగల్గుతారని సూచించారు. గమ్యాన్ని చేరుకునే వరకు నిరంతర ప్రయత్నాన్ని కొనసాగిస్తూ ధృడ సంకల్పంతో ముందుకు వెళ్లాలని మార్గనిర్దేశం చేశారు. ప్రపంచంలో అసాధ్యం అన్నది ఏదీ లేదని, సరైన ప్రణాళిక, కష్టపడే తత్వం, సానుకూల దృక్పథంతో కూడిన కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని ఉద్యోగార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందింపజేశారు. రెండు నెలల పాటు సెల్ ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, ముందస్తు శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. అంకితభావం, పట్టుదల, ఏకాగ్రతతో చదువుతూ ఉచిత శిక్షణ తరగతులను కొలువుల సాధనకు అనుకూలంగా మలచుకోవాలని సూచించారు. అనవసర భయాలను విడనాడి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని, నిరంతర సాధన ద్వారా పోలీస్ రిక్రూట్ మెంట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ హైదరాబాద్ లో అందించే కోచింగ్ కు ఏమాత్రం తక్కువ కాకుండా మరింత మెరుగైన మెటీరియల్ తో పాటు, నిష్ణాతులైన ఫ్యాకల్టీచే స్థానికంగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయించామని చెప్పారు.

ప్రీ రిక్రూట్ మెంట్ ట్రైనింగ్ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ అన్ని విధాలుగా తోడ్పాటును అందించారని జిల్లా పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. అర్హత కలిగిన సమర్థవంతులైన అభ్యర్థులు పోలీస్ ఉద్యోగాలను సాధించి, ప్రజలకు సేవలందించాలనే సంకల్పంతో జిల్లా యంత్రాంగం సహకారంతో ఈ ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. దీని ప్రాధాన్యతను అభ్యర్థులు గుర్తెరగాలని, క్రమం తప్పకుండా తరగతులకు హాజరై, నిరంతర సాధన చేయాలని సీ.పీ సూచించారు. రెండు నెలల పాటు వినోదాలు, వేడుకలకు దూరంగా ఉండి, ఏకాగ్రతతో కృషి చేస్తే పోలీస్ శాఖలో చేరాలనే కలను సాకారం చేసుకోగల్గుతారని అన్నారు.

ఈ కార్యక్రమంలో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, భాగ్యకిరణ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ భాగ్య కిరణ్, నిజామాబాద్ ఏ.సీ.పి ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నందిపేట్ రోడ్డు ప్రమాద బాధితుడికి రూ. 65 వేల ఆర్థిక సాయం



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబరు 09: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న నందిపేట్ మండల కేంద్రానికి చెందిన ఎల్లేటి శివశంకర్ కుటుంబానికి విశ్వకర్మ సంఘం నాయకులు బుధవారం అండగా నిలిచారు. విశ్వకర్మ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరామ్ మహిపాల్ చారి, ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ఎండి కొండోజు నరసింహ చారిలు బాధితుడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన 'వేస్కో ట్రస్ట్', పలువురు దాతల సహకారంతో సేకరించిన రూ. 65 వేల ఆర్థిక సహాయాన్ని బాధితుడికి అందజేశారు. శివశంకర్ కుటుంబ దీనస్థితిని చూసి చలించిన నరసింహ చారి.. బాధితుడి భార్య అనూషకు ఉపాధి నిమిత్తం 'బ్యాంగిల్స్ అండ్ జనరల్ స్టోర్' షాప్ పెట్టిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఆమెకు కుట్టు మిషన్ ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని మహిపాల్ చారి నిరూపించారు. కనీసం ఇల్లు కూడా లేని ఈ నిరుపేద కుటుంబానికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, దాతలు స్పందించి మరింత సహాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో విశ్వకర్మ వేల్పూర్ మండల అధ్యక్షుడు నూనె గంగాధర్, శ్రీరామ్ సుదర్శన్, నారాయణ, గంగాధర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




## జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో జీవిర్ కరాటే అకాడమీ విద్యార్థుల ప్రతిభ

హైద్రాబాద్ సెప్టెంబర్ 9(ప్రజాకలం న్యూస్) గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సెప్టెంబర్ 5,6 తేదీల్లో నిర్వహించిన టైకా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్--2026 జాతీయ స్థాయి కరాటే పోటీలలో జీవిఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొని పలు పతకాలు సాధించి ప్రతిభను చాటుకున్నారు. కుమితే,కటా విభాగాల్లో కలిపి 15 బంగారు పతకాలు,12 రజత పతకాలు, 25 కాంస్య పతకాలు --- మొత్తం 52 పతకాలను జీవిఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు సాధించి జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ విద్యార్థులను అభినందిస్తూ, క్రీడల్లో ప్రతిభ కనబరచడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందుతాయని అన్నారు. క్రీడా రంగంలో కూడా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ అచ్యుతదేవి మాట్లాడుతూ జీవితంలో కేవలం విద్య మాత్రమే సరిపోదని, విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో ముఖ్యమని అన్నారు. విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి విద్య, క్రీడలు రెండూ అవసరమని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీవిఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్ రెడ్డి,అకాడమీ బ్లాక్ బెల్ట్స్ అమృత రెడ్డి,గణ సంతోషిని రెడ్డి,వెంకట్ రెడ్డి, ద్వైత, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## నిబంధనలు ఉల్లంఘిస్తే డీజేలు సీజ్: కమ్మర్‌పల్లి ఎస్సై సతీష్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబరు 09:

గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మండల పరిధిలోని డీజే ఆపరేటర్లు, సౌండ్ సిస్టమ్ నిర్వాహకులకు బుధవారం కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని స్థానిక తహసీల్దార్ సమక్షంలో హాజరుపరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సిహెచ్. సతీష్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధిక శబ్దాలు చేసే డీజే సిస్టమ్‌ల వినియోగంపై పూర్తి నిషేధం ఉందన్నారు. గణేష్ మండపాల వద్ద గానీ, శోభాయాత్ర, నిమజ్జనం సమయంలో గానీ డీజేలు, బాక్స్ వాల్స్ ఉపయోగించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆపరేటర్లపై చట్టపరమైన కేసులు నమోదు చేయడంతో పాటు సౌండ్ పరికరాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని, పోలీసులకు పూర్తి సహకారం అందించాలని ఎస్సై కోరారు.

## కాళోజీ రచనలు సమాజానికి చైతన్యదీప్తులు

### పాలెం జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 09:

ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు రచనలు సమాజానికి చైతన్యదీప్తులని మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామ స్థానిక



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు త్రివేణి పేర్కొన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో తెలంగాణ భాషా దినోత్సవం, కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమంతో పాటు తెలంగాణ ఉద్యమ సమయంలోనూ కాళోజీ తన లేఖిని ద్వారా ప్రజలను ఎంతగానో ఉత్తేజపరిచారని కొనియాడారు. "పుట్టుక నీది, చావు నీది.. బ్రతుకంతా దేశానిది" అంటూ ఆయన సాగించిన జీవన ప్రస్థానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. అనంతరం విద్యార్థులు కాళోజీ రచించిన వివిధ కవితలు, సామాజిక అంశాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయురాలు త్రివేణిని, ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు మహేష్ కుమార్, చంద్రశేఖర్, నరసింహ స్వామి, రాజేందర్, శ్రీ వేణి, నచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## "హైద్రాబాద్ వస్తున్నాం" అంటున్న ముంబై ఉద్యమకారులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 09:

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన అనేది నాల్గు ఫేజ్ లపై సాగింది. సొంత తెలంగాణ గడ్డపై ఒకటైతే, రెండవది ముంబై రీజియన్ లో, 3వది ఎన్.ఐ.ఆర్ విదేశాల్లో, చివరిది దేశ రాజధాని ఢిల్లీలో ఉధృత పోరాటాల వల్లనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామనే నగ్న సత్యాన్ని భారత్ లేబర్ సేవ సంఘం (బిఎల్ఎస్ఎస్) ప్రముఖులు సాయిలు ముదిరాజ్ వెల్లడించారు. ఐతే తాము ముంబైకర్లం రెండవ స్థానంలో ఉన్న గౌరవశాలి విషయం ప్రపంచానికి అవగతమే. బుధవారం ఉదయం బిఎల్ఎస్ఎస్, ఎంటిజెఏసి సంయుక్తంగా పశ్చిమ ములుండ్ తెలుగు అడ్డా వద్ద సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ముంబై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎంటిజెఏసి) నాయకులు ఏటం అజయ్ మాట్లాడుతూ హైద్రాబాద్లో కెకె కమిటి ఏర్పడినప్పటి నుంచి మూడు మీటింగ్లకు తమ "ముంబై సమన్వయకర్తల బృందం" హాజరైందని, వారి సూచనల మేరకు అన్ని రకాల ఆధారాలతో "చలో హైదరాబాద్" కార్యక్రమం త్వరలోనే చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో సావరీ దత్తా యాదవ్, పొన్నాల అంజయ్య మహరాజ్, అందే శ్రీను, ఎం. మల్లేష్, కె. బసప్పా, బండి రమేష్, కార్మిక నేత కాశీంభాయి, వి.వెంకటేష్ మహరాజ్ పాల్గొన్నారు.



# ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణకు స్పీడ్ పెంచండి!

## -పూర్తయిన భూమిని జాతీయ రహదారి అధికారులకు అప్పగించాలి..

## -ఆర్బిట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి: ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి కె. గంగాధర్



గజ్వేల్:09 సెప్టెంబర్ (ప్రజా కలం ప్రతినిధి)

రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, భూసేకరణ పూర్తయిన భూమిని నేషనల్ హైవే అధికారులకు త్వరితగతిన అప్పగించాలని రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి కె.గంగాధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని సమీకృత కార్యాలయ సముదాయంలో జిల్లా కలెక్టర్ కె.హైమావతితో కలిసి రీజనల్ రింగ్ రోడ్ భూసేకరణపై నేషనల్ హైవే, రెవెన్యూ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రీజనల్ రింగ్ రోడ్డును ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా చేపట్టాయని తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని రాయపోల్,వర్గల్,మర్కుక్, గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాల మీదుగా ఆర్ఆర్ఆర్ నిర్మాణం సాగనున్న నేపథ్యంలో భూసేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆర్బిట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ నిర్మాణంతో ఆయా ప్రాంతా లకు కలిగే అభివృద్ధి, ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించా రు. ఆర్డీఓ ఆధ్వర్యంలో తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది సమన్వయం తో పనిచేస్తూ భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో డ్రోన్ సర్వే నిర్వహించి,రైతులు కొత్తగా పంటలు సాగు చేయకుండా చర్యలు తీసుకొని భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ పూర్తయిన భూమిని నిబంధనల ప్రకారం నేషనల్ హైవే అధికారులకు అప్పగించాలని తెలిపారు. ఆర్ఆర్ఆర్ కోసం అప్పగించిన భూమి బాధ్యత పూర్తిగా నేషనల్ హైవే అథారిటీ పరిధిలో ఉంటుందని,భూమి అప్పగింత అనంతరం కూడా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు రెవెన్యూ,నేషనల్ హైవే అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని గంగాధర్ ఆదేశించారు. ఈ సమీక్షలో కలెక్టర్ కె.హైమావతితో పాటు ఆర్డీఓ చంద్రకళ, నేషనల్ హైవే అధికారులు, ఆయా మండలాల తహసీల్దార్లు,సర్వే అధికారులు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ సర్కిల్ లో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

### డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య



మహేశ్వరం, సెప్టెంబర్ 09,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో ప్రముఖ ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య కార్యాలయ అధికారులు, సిబ్బంది కాళోజీ నారాయణరావు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కాళోజీ నారాయణరావు తన సాహిత్యం, రచనలు మరియు ప్రజా ఉద్యమాల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చారని, ప్రజల సమస్యలను తన రచనల ద్వారా బలంగా వినిపించిన మహోన్నత కవిగా ఆయన చిరస్మరణీయులని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ సర్కిల్-16 అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ.. కలం కదిలింది!..

### ప్రజా సమస్యలపై కాళోజీ కలం పదునైన ఆయుధం

పటాన్‌చెరు, సెప్టెంబర్ 9 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రజల సమస్యలను తన రచనలతో ప్రశ్నించి, తెలంగాణ సాహిత్యం, ప్రజా చైతన్యానికి విశేష సేవలందించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పటాన్‌చెరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా




నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ అధికారి యాదగిరి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాళోజీ సాహిత్యం తెలంగాణ ప్రజల జీవన విధానం, భావోద్వేగాలకు అద్దం పట్టిందని యాదగిరి తెలిపారు. ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యలను తన రచనల ద్వారా వెలుగులోకి తెచ్చిన కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. సమాజంలో చైతన్యం తీసుకురావడంలో ఆయన రచనలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. కాళోజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగేశ్వరరావు నాయక్, పర్యవేక్షకుడు వెంకటేష్, సీనియర్ సహాయకుడు అనంతరావు, జూనియర్ సహాయకురాలు రమాదేవి, సిబ్బంది నరసింహ, తాహిర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు..

## సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

### - మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం, సెప్టెంబర్ 09,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని వనస్థలిపురంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, వసతి గృహంలో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేరెంట్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థినులకు అవసరమైన కనీస మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని పేరెంట్స్ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకువచ్చి తుక్కుగూడ లోని క్యాంపు కార్యాలయంలో విన్నతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అప్పటికప్పుడు విద్యాశాఖ అధికారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కారించాలని ఆదేశించారు. పేరెంట్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ప్రస్తుతం ఉన్న వసతి గృహ భవనం విద్యార్థినులకు అనుకూలంగా లేకపోవడంతో, దానిని తక్షణమే మార్చి విశాలమైన, సురక్షితమైన భవనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా బెంచీలు, ఇతర ఫర్నిచర్ అందుబాటులో లేవని తెలిపారు. వసతి గృహంలో విద్యార్థినులకు సరిపడా పడకలు, బెడ్‌కాట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో తగినంత లైట్లు, ఫ్యాన్లు లేకపోవడంతో దోమల సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీంతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలకు పూర్తిస్థాయి ప్రిన్సిపాల్ లేకపోవడం వల్ల పరిపాలనా సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. పాఠశాలకు ప్రిన్సిపాల్‌తో పాటు అవసరమైన బోధనేతర సిబ్బంది, కేర్‌టేకర్, సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని కోరారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్యం, విద్యాభ్యాసాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని పేరెంట్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సురక్షితమైన వసతి గృహ భవనం, తాగునీరు, బెంచీలు, పడకలు, ఫ్యాన్లు, లైట్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

## ప్రజాకవి కాళోజీకి ఘన నివాళి

### - ఇస్నాపూర్‌లో కాళోజీ జయంతి వేడుకలు..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 9 (ప్రజా కలం) ప్రతినిధి

తెలంగాణ ప్రజల జీవన వాస్తవాలను తన కలంతో ప్రపంచానికి చాటిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఇస్నాపూర్ పురపాలక సంఘం కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ఎత్తిచూపుతూ, సామాజిక చైతన్యానికి బాటలు వేసిన కాళోజీ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఇస్నాపూర్ పురపాలక సంఘం చైర్‌పర్సన్ మోటే సుమలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, పురపాలక కమిషనర్ వెంకట కిషన్‌రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన ప్రజా సాహిత్యానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రజల పక్షాన నిలబడి అన్యాయాలను ప్రశ్నించిన కాళోజీ ఆలోచనలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని కార్యక్రమంలో పేర్కొన్నారు. ఆయన రచనలు, ప్రజా ఉద్యమాల పట్ల ఆయన చూపిన నిబద్ధతను నేటి తరానికి చేరవేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాళోజీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు..

## 25 ఏళ్లుగా ఉపాధ్యాయులకు ఘన సత్కారం!

### - 22, 23న పటాన్‌చెరులో వేడుకలు..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 9 (ప్రజా కలం) ప్రతినిధి

ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సత్కరించేందుకు పటాన్‌చెరు నియోజకవర్గంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం తన



శిబిర కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లతో ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. 25 ఏళ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. 22న ప్రభుత్వ, 23న ప్రైవేటు ఉపాధ్యాయులకు పటాన్‌చెరులోని జీఎంఆర్ సమావేశ మందిరంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎంఈఓలు నాగేశ్వరరావు నాయక్, సుధాకర్, విజయ్ కుమార్, పౌలిన, భాస్కర్, ప్రధానోపాధ్యాయుడు రాథోడ్, పాఠశాలల ప్రతినిధులు తేజ, ప్రభాకర్ రెడ్డి, మహేష్ పాల్గొన్నారు..

## బడంగ్‌పేట్ జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య

మహేశ్వరం, సెప్టెంబర్ 09,(ప్రజా కలం)

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ సర్కిల్-16 కార్యాలయంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహేశ్వరం నియోజకవర్గ గౌరవ శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి, బడంగ్‌పేట్ సర్కిల్-16 డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య హాజరై స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్జి ) మహిళలకు, పలు కాలనీ వాసులకు మరియు కార్యాలయ సిబ్బందికి మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి గణపతి విగ్రహాల వినియోగం పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని, నిమజ్జనం సమయంలో జల కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. ప్రజలందరూ పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించి, వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ అధికారులు శ్రీమతి బి. రూపా డి వై ఈ ఈ ( ఎస్ డబ్ల్యు ఎం ), అశ్విని కుమారి డీపీవో , గంగాప్రసాద్ ఏ ఈ , కార్యాలయ సిబ్బంది, మహిళలు, మీడియా ప్రతినిధులు, పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.



## విద్యుత్ లేక అంధకారంలో కాటేదాన్ లో పలు కాలనీలు

- అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలే
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని బిక్కుబిక్కుమంటూ ఖాళీ ప్రజలు
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం
- తక్షణమే విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలి

-కాటేదాన్ డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్




రాజేంద్రనగర్, సెప్టెంబర్ 09,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ నియోజకవర్గం కాటేదాన్ పరిధిలోని మోహన్ రెడ్డి నగర్, బాబుల్ రెడ్డి నగర్, బృందావన్ కాలనీ, లాల్ బహుదూర్ నగర్, అర్జున్ బస్తి (వడ్డెర బస్తీ), ఆదర్శనగర్, బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతం, నేతాజీ నగర్, శ్రీరామ్ నగర్, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాలు వీధి దీపాలు లేక తీవ్ర అంధకారంలో కొట్టుమిట్టాడు తున్నాయని కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... “ఇటీవల కురుస్తున్న వర్షాలకు చీకటి తోడవడంతో విషపురుగులు, పాములు ఇళ్లలోకి వస్తుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు డ్రైనేజీ, నిలిచిన నీటి కారణంగా దోమల తీవ్రత పెరిగి, చిన్న పిల్లలు, వయోవృద్ధులు రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ సమస్యలపై జీహెచ్ఎంసీ ( జిహెచ్ ఎంసి ) అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం అత్యంత విచారకరం” అని మండిపడ్డారు. అలాగే, “దరుహులుం మదర్సా నుండి శివరాంపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో ఒక్క వీధి దీపం కూడా వెలగడం లేదు. చీకటిని ఆసరాగా చేసుకుని ఆకతాయిలు ఈ దారిలో వెళ్లే మహిళలను, పాదచారులను వేధింపులకు గురిచేస్తున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో దొంగతనాల భయం కూడా తీవ్రంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఈ మార్గంలో పోలీసుల పెట్రోలింగ్ కూడా లేకపోవడం గమనార్హం. రేపు పొద్దున ఏదైనా జరగరాని ఘోరం జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారు?” అని ఎస్. వెంకటేష్ గారు సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు మరియు పోలీసు శాఖ వెంటనే స్పందించి, ఆయా కాలనీలతో పాటు శివరాంపల్లి రైల్వే స్టేషన్ మార్గంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, పోలీసు పెట్రోలింగ్ పెంచి ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు తగిన భద్రత కల్పించాలని కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ గారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నోముల రాము యాదవ్ , గుమ్మడి మైసి రెడ్డి , గంజి రాజు , కొంపల్లి జగదీష్ , కార్మిక శాఖ విభాగ్ అధ్యక్షులు ఉప్పల్ శ్రీను , అశోక్ కుమార్ , రామ స్వామి , సంరెడ్డి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి , ప్రదీప్ పాల్గొన్నారు.

## బేగంపేట పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 09.

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బేగంపేటలో ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల



ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, తెలుగు క్విజ్, తెలుగు బోధనా సామగ్రి ప్రదర్శన నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల నాటకం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ భాష, యాస, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాలని ప్రధానోపాధ్యాయురాలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

## వినాయకుని శోభాయాత్రలో డీజేలో అనుమతి లేదు
## నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు
## తీసుకుంటాం--బొమ్మలరామారం ఎస్.ఐ బుగ్గ శ్రీశైలం

బొమ్మలరామారం, సెప్టెంబర్ 09 (ప్రజా కలం)

గణేష్ పండుగను శాంతియుతంగా జరుపుకునేందుకు విగ్రహాన్ని పెట్టుకునే ప్రతి ఒక్కరు ఆన్ లైన్ లో వివిధ గ్రామాల కమిటీ సభ్యులు గణేష్ వివరాలను నమోదు చేయాలని బొమ్మలరామారం ఎస్ఐ బుగ్గ శ్రీశైలం అన్నారు బుధవారం రోజున వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి మండలంలోని సర్పంచ్ ల అందరితో పీస్ కమిటీ సమావేశం స్థానిక పోలీస్ స్టేషన్ లో నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్.ఐ శ్రీశైలం మాట్లాడుతూ ఆన్ లైన్ లో నమోదు చేసిన వివరాలు బట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేయడం జరుగుతుందన్నారు. రాత్రి సమయంలో మండపాల వద్ద ముగ్గురు వాలంటీర్లు ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.గణేష్ మండపాలు రోడ్లను బ్లాక్ చేసి పెట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయి అని అన్నారు కాబట్టి రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకోవాలన్నారు.ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు,గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. వినాయక శోభయాత్రలో డీజె లకు అనుమతి లేదు అని అన్నారు ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు గణేష్ ఉత్సవ సమితి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# బొమ్మలరామారం మండల నూతన తాహాసిల్దారుగా పి.రాధ

బొమ్మలరామారం,సెప్టెంబర్ 09 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండల తహసిల్దార్ కార్యాలయంలో పనిచేసిన పి.శ్రీనివాసరావు జులై 30వ తేదీన పదవీ విరమణ చేశారు అప్పటినుండి మండలానికి నూతన తాహాసిల్దార్ ను నియమించకపోవడంతో డిప్యూటీ తాహాసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న



సునీల్ కుమార్ కు ఇన్చార్జి తాహాసిల్దారుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు గత 40 రోజులుగా ఉత్కంఠ రేపిన మండల తాహాసిల్దార్ కార్యాలయంలో నూతన తాహాసిల్దార్ నియామకానికి తెర పడింది ఎట్టకేలకు భువనగిరి ఆర్డీవో కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.రాధ బుధవారం రోజున బొమ్మలరామారం మండల నూతన తాహాసిల్దారుగా పదవీ బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా నూతన తాహాసిల్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తానని అన్నారు తెలంగాణ తహసీల్దార్ ల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గా పి.రాధ పనిచేస్తున్నారు నూతన తాహాసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన పి.రాధకు తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ (TGRSA) జిల్లా అధ్యక్షులు,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కొండం వెంకట్ రెడ్డి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో మండల కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# గ్రామంలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

## - కల్వకోల్ గ్రామసభ ద్వారా విబిజి రామ్ జి పనుల గుర్తింపు
## - గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ

మహేశ్వరం, సెప్టెంబర్ 09,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో విబిజి రామ్ జి పథకంలో భాగంగా పనుల గుర్తింపు గ్రామసభ ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా మిషన్ భగీరథ వాటర్ మండల్ ఏఈ రఘు హాజరయ్యారు.ఈ సందర్భంగా హర్ ఘర్ జల్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని తాగునీటి సమస్యలపై ఆయన ప్రజలతో మాట్లాడారు. ఇంటింటికి సురక్షిత మంచినీటి సరఫరా, పైప్ లైన్ నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం గ్రామ మహిళా సంఘాల సభ్యులు తమ సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గ్రామంలో బస్సు సౌకర్యం లేకపోవడం, పాఠశాలలో మౌలిక వసతుల కొరత వంటి సమస్యలను విన్నవించారు.దీనిపై సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ వెంటనే స్పందిస్తూ బస్సు సమస్య, పాఠశాల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విలేజ్ సెక్రటరీ వేణు, వార్డు మెంబర్ మంగ, పాఠశాల ఉపాధ్యాయురాలు పుష్పరాగం టీచర్, అంగన్వాడీ సంతోష, మహిళా సంఘాల ప్రతినిధులు గీత, గూడెపు మాధవి, గూడెపు రేణుక, కవిత తో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 'అరైవ్ అలైవ్'లో భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన




**బంజారాహిల్స్, సెప్టెంబర్ 9 (ప్రజాకలం) :** 'అరైవ్ అలైవ్' ప్రచారంలో భాగంగా బంజారాహిల్స్‌లోని సరస్వతి జూనియర్ కాలేజీలో విద్యార్థులు, సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ వి.సి. సజ్జనార్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ జోయల్ డేవిస్ ఆదేశాల మేరకు బేగంపేట టి.టి.ఐ ఇన్‌స్పెక్టర్ శ్రీ నాగుల అశోక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

కార్యక్రమానికి ట్రాఫిక్-2 అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ సి. వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. వాహనం నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. మన భద్రతతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల భద్రత కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ప్రమాదాలను ముందుగానే అంచనా వేసి అప్రమత్తంగా వాహనం నడపడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, డిఫెన్సివ్ డ్రైవింగ్ సురక్షితమైన డ్రైవింగ్ విధానమని తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు అందించే సహాయం ఎంతో కీలకమని, ప్రమాదం జరిగిన తర్వాతి లి'గోల్డెన్ అవర్'లిలో సకాలంలో వైద్యం అందితే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రమాద బాధితులకు సహాయం చేసే వారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 'రాహ్-వీర్' (గుడ్ సమారిటన్) పథకం కింద రూ.25,000 నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

బేగంపేట టి.టి.ఐ ఇన్‌స్పెక్టర్ శ్రీ నాగుల అశోక్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, ముఖ్యంగా 18 ఏళ్లలోపు వారు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు.

సీటు బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, నిర్ణీత వేగ పరిమితులను పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం, ట్రాఫిక్ సిగ్నళ్లను పాటించడం, ముందు వాహనంతో సురక్షిత దూరం పాటించడం, ఇండికేటర్లను సక్రమంగా ఉపయోగించడం వంటి అంశాలను వివరించారు. రోడ్డు దాటే సమయంలో ఇరువైపులా చూసుకోవడం, రహదారి సంకేతాలను గమనించడం, వాహనాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించుకోవడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సునీల్ కంశెట్టి, చైర్మన్ రామసుబ్బయ్య, ప్రిన్సిపాల్ జి.ఎస్. రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ అజయ్ కంశెట్టి, క్యాంపస్ ఇన్‌చార్జి ఇమ్రాన్ ఖాన్, కళాశాల సిబ్బంది, టి.టి.ఐ సిబ్బంది రాజేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి--65పై ఉన్న దాబాలపై

# ప్రత్యేక ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

## 138 కిలోల కల్తీ/అననుకూల ఆహారం ధ్వంసం

ఉమ్మడి నల్గొండ జిల్లా, సెప్టెంబర్ 09 (ప్రజా కలం)

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కమిషనర్,TG SAFE ఆదేశాల మేరకు నల్గొండ,యాదాద్రి భువనగిరి జిల్లాల్లో జాతీయ రహదారి--65 వెంబడి ధాబాలు,హోటళ్లు,రెస్టారెంట్లపై బుధవారం ప్రత్యేక ఆహార పరిరక్షణ తనిఖీలు నిర్వహించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో జిల్లా డిజిగ్నేటెడ్ ఆఫీసర్ పి.స్వాతి,ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎన్.శివ శంకర్ రెడ్డి తనిఖీలు చేపట్టారు. తుప్రాన్‌పేట్‌లోని చాచా ఫ్యామిలీ ధాబాలో తనిఖీల సందర్భంగా నిబంధనల ఉల్లంఘనలు తీవ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రిఫ్రిజిరేటర్‌లో గడువు ముగిసిన వినియోగ తేదీతో కుళ్లిన మాంసాన్ని నిల్వ చేయడం,సరైన ఉష్ణోగ్రత నియంత్రణ లేకపోవడం, రిఫ్రిజిరేటర్లలో ఫంగస్,దుమ్ము, మురికి పేరుకుపోవడం, సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగం,ఆహార పదార్థాలను నేలపై నేరుగా నిల్వ చేయడం,ఆహార నిర్వహణ సిబ్బంది




వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం వంటి లోపాలు బయటపడ్డాయి.దీంతో ధాబాను సీజ్ చేసి,ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌ను సస్పెండ్ చేశారు. ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేసి,శాంపిళ్లను పరీక్ష నిమిత్తం సేకరించారు.62వేల రూపాయల విలువగల 83 కిలోల కుళ్లిన మాంసం,ఇతర అననుకూల ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. మాల్కాపూర్‌లోని సంగం హోటల్‌లో కూడా పలు ఉల్లంఘనలు గుర్తించారు.

ఫంగస్ సోకిన కూరగాయలు, సరైన ఉష్ణోగ్రత నియంత్రణ లేని రిఫ్రిజిరేటర్లు,వినియోగ తేదీలు లేకుండా నిల్వ చేసిన మాంసం,సాస్‌లు,గ్రేవీలు,అల్లం తదితర పదార్థాలు గుర్తించారు. పెస్ట్ కంట్రోల్, ఆహార నిర్వహణ సిబ్బంది మెడికల్ ఫిట్‌నెస్‌కు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేవని గుర్తించారు. హోటల్‌కు ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేసి, ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్, నాలుగు సర్వైలెన్స్ శాంపిళ్లను సేకరించారు. 10 కిలోల మాంసం ఉత్పత్తులు,5 కిలోల కూరగాయలు,30 కిలోల గ్రేవీలు,10 కిలోల టీ పొడి.. మొత్తం 55 కిలోల మానవ ఆహారానికి మానవ ఆహార వినియోగానికి పనికిరాని ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు.

రెండు హోటలలో,మొత్తం 138 కిలోల మానవహారం వినియోగానికి పనికిరాని అటువంటి ఆహార పదార్థాలను ప్రజల ఆరోగ్యరీత్యా అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఆహార పరిరక్షణ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని అధికారులు స్పష్టం చేశారు.తనిఖీలు ఇలాగే కొనసాగుతాయని, వ్యాపారులు బాధ్యతాయుతంగా,ఆహార పరిరక్షణ ప్రమాణాలను పాటించాల్సిందిగా,లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని ఉమ్మడి నల్గొండ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి హెచ్చరించడం జరిగింది.

# ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి

## - బాలల సృజనాత్మకతకు కథా కార్యశాలలు దోహదం
## - మాజీ కార్పొరేటర్ నిమ్మల సునీతా శ్రీకాంత్ గౌడ్

మహేశ్వరం, సెప్టెంబర్ 9, (ప్రజా కలం).

కథా కార్యశాలలు, శిక్షణా శిబిరాలు బాలలలోని సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి ఎంతో తోడ్పడతాయని మాజీ కార్పొరేటర్ నిమ్మల సునీతా శ్రీకాంత్ గౌడ్ అన్నారు.ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా నాదర్గుల్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల కోసం ప్రత్యేక కథా కార్యశాల, సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు మరియు శాంతా వసంతా ట్రస్ట్ సంయుక్త సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిమ్మల సునీతా శ్రీకాంత్ గౌడ్ దంపతులు హాజరయ్యారు. నాదర్గుల్ నివాసి, ప్రముఖ బాల సాహిత్యవేత్త పైడిమర్రి రామకృష్ణ ఆధ్వర్యంలో, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ అహ్మద్ ఖాన్, తెలుగు ఉపాధ్యాయులు శ్రీ కాలే బీరప్ప, బాయికాడి నరేందర్ రెడ్డి నేతృత్వంలో కార్యక్రమం జరిగింది.పిల్లలకు కథలు, గేయాలు రాసే నైపుణ్యాన్ని అందించేందుకు విషయ



నిపుణులుగా బాల సాహిత్యవేత్తలు తుమ్మూరి రాంమోహన్ రావు, ఆకెళ్ల వెంకట లక్ష్మి పాల్గొని విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా తెలంగాణ సారస్వత పరిషత్తు వారి 'రచనాకళ' శ్రీ తుమ్మూరి రాంమోహన్ రావు రచించిన 'చిన్నారి కోయిల' పుస్తకాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

# బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబర్ 09,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం అల్మాస్గూడ 57వ డివిజన్‌లోని కోమటికుంట నుండి హైమాత టెంపుల్ వరకు రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు.ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు, కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సమ్మిరెడ్డి, సప్న వెంకటరెడ్డి, ఏనుగు రాంరెడ్డి, రామిరెడ్డి, శేఖర్ రెడ్డి, ముత్యాల కృష్ణ, రామిడి తుఫాన్ రెడ్డి, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామ్ రెడ్డి, బొజ్జ రవీందర్ రెడ్డి, కే. రవి తదితర నాయకులు, కాలనీవాసులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ హామీలపై ప్రజలకు 'బాకీ కార్డు' పంపిణీ

**ముషీరాబాద్,సెప్టెంబరు 9 (ప్రజా కలం ప్రతినిధి):**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు రేషం మల్లేష్ ఆధ్వర్యంలో 'కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డు' కార్యక్రమాన్ని నిర్వహించారు. బాకారం,రెడ్ కాన్వెంట్ స్కూల్,శివస్థాన్‌పూర్ ప్రాంతాల్లో బస్తీబస్తీ తిరుగుతూ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వివరిస్తూ బాకీ కార్డులను పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీఎస్ఆర్,ముఠా జైసింహ,ఎంఎన్ శ్రీనివాసరావు,నాగేష్ ముదిరాజ్ పాల్గొని ఇంటింటికీ బాకీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిరిగిరి శ్యామ్,కల్వ గోపి,నేత శ్రీనివాస్,అజయ్ ముదిరాజ్,ఆర్.మోజస్, సత్యనారాయణ రెడ్డి, శంకర్ ముదిరాజ్,శ్రీహరి, రాకం సత్యనారాయణ, వెంకటేష్,సునీల్, అమిత్,బన్నీ,అరుణ్, రాజేష్,గండు వెంకటేష్, నీలమ్మ,సంపూర్ణ, తులసి,సాలమ్మ, అనురాధ,సబిత,శశికళ, గీతారెడ్డి,లలిత,భాగ్య, రజిని,పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్





**మల్కాజిగిరి, సెప్టెంబరు 9(ప్రజా కలం ప్రతినిధి):**

ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పరిశోధన పూర్తి చేసిన కొమ్ము శేఖర్ మాదిగకు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా లభించింది.ఈ నెల 8న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో యూనివర్సిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు, చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ కృష్ణ ఎల్లా హాజరయ్యారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం చేతుల మీదుగా కొమ్ము శేఖర్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్ వై.పార్థసారథి పర్యవేక్షణలో "కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ మునిసిపల్ కార్పొరేటర్స్ అండ్ కౌన్సిలర్స్ టువర్డ్స్ అర్బన్ గుడ్ గవర్నెన్స్: ఎ స్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై శేఖర్ పరిశోధన చేశారు. సూర్యాపేట జిల్లా యర్కారం గ్రామానికి చెందిన కొమ్ము శేఖర్ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించిన కొమ్ము సరోజ, అంజయ్య దంపతుల కుమా రుడు. స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివిన ఆయన అనంతరం ఎల్‌బీనగర్‌లో పదో తరగతి, ఇబ్రహీంపట్నంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్, నిజాం కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ప్రత్యేక తెలం గాణ ఉద్యమ సమయంలో విద్యార్థి నాయకు డిగా చురుకుగా పాల్గొన్న శేఖర్, అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎంఏ పూర్తి చేశారు.సామాజిక న్యాయ ఉద్యమంలో కొనసాగుతూనే ఉన్నత విద్యపై దృష్టి సారించి పీహెచ్‌డీ పూర్తి చేశారు. మాదిగ విద్యార్థి సమాఖ్యలో కీలక నాయకుడిగా పనిచేసిన శేఖర్ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడిగా, పలు జిల్లాల బాధ్యతలు నిర్వహించారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. డాక్టరేట్ పట్టా అందుకున్న సందర్భంగా తనకు స్ఫూర్తినిచ్చిన మందకృష్ణ మాదిగతో పాటు పరిశోధనలో సహకరించిన ప్రొఫెసర్ వై. పార్థసారథి,పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధ్యాపకులు,సిబ్బందికి శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు కొమ్ము శేఖర్‌ను అభినందించారు.

## భూభారతితో రైతులకు న్యాయం జరగాలి

**- తెలంగాణ గిరిజన సమాఖ్య -జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: సెప్టెంబర్ 09: (ప్రజా కలం న్యూస్)**

భూభారతి రీ-సర్వే ద్వారా చిన్న, సన్నకారు రైతులకు పూర్తి న్యాయం జరిగేలా పారదర్శకంగా చర్యలు చేపట్టాలని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ భూక్య శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భూభారతి పైలట్ ప్రాజెక్టు కింద రామవరం రెవెన్యూ గ్రామం ఎంపికైన సందర్భంగా చిట్టి రామవరంలో నిర్వహించిన గ్రామసభ అవగాహన సదస్సులో భూక్యా శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు తరాలుగా సాగులో ఉన్న అర్హులైన రైతులందరికీ క్షేత్రస్థాయి పరిశీలన జరిపి వెంటనే పట్టాలు మంజూరు చేయాలన్నారు. రికార్డుల్లోని తప్పులను సరిచేసి రైతులకు సంక్షేమ పథకాలు దక్కేలా చూడాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా స్పష్టమైన హద్దులు నిర్ణయించాలన్నారు. రైతుల రాకపోకలకు ఆధారమైన డొంక దారులను గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలని కోరారు. రైతుల అభ్యంతరాలను స్వీకరించి ఎలాంటి వివాదాలు లేకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలి

**- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరిన ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్**

**హైదరాబాద్, సెప్టెంబరు 9(ప్రజా కలం ప్రతినిధి):**

కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల అభ్యర్థులకు వయోపరిమితిని పెంచాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కరోనా పరిస్థితులు, ఉద్యోగ నియామక ప్రకటనలు ఆలస్యం కావడం వల్ల అనేక మంది నిరుద్యోగులు వయోపరిమితి దాటిపోయి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పోలీస్ ఉద్యోగాల నియామకాల్లో వయోపరిమితిని సడలించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న గరిష్ఠ వయోపరిమితిని కానిస్టేబుల్ ఉద్యోగాలకు 34 ఏళ్ల నుంచి 36 ఏళ్లకు, ఎస్సై ఉద్యోగాలకు 37 ఏళ్ల నుంచి 38 ఏళ్లకు పెంచాలని బల్మూర్ వెంకట్ విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగుల అభ్యర్థనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని,అన్ని అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్ తెలిపారు.



## రోడ్డు చిన్నది.. భవనం పెద్దది!

**- 20 అడుగుల రోడ్డుపై ఆకాశహర్మ్యాలు!**
**- టౌన్ ప్లానింగ్‌లో నిబంధనలు నిద్రలోనా?..**
**- నిర్మాణాల సెట్‌బ్యాక్‌లకు చోటేది?**
**- ఇంద్రేశం మున్సిపాలిటీ భవన అనుమతులపై అనేక అనుమానాలు!..**
**- ప్రమాదం వస్తే బాధ్యత ఎవరిది?..**

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 9 (ప్రజా కలం ప్రతినిధి)**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో భవన నిర్మాణాలపై నిబంధనలు అమలవుతున్నాయా? లేక కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా? అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళిక విభాగం, అధికారులు, నిర్మాణాలకు సంబంధించిన నిబంధనలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో రహదారి వెడల్పుతో పోలిస్తే భారీ భవనాలు నిర్మిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా 20 అడుగుల రోడ్లకు ఐదు అంతస్తుల వరకు భవన నిర్మాణాలకు అనుమతులు ఎలా లభిస్తున్నాయి? అనే ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా మారింది. భవన నిర్మాణాలకు తప్పనిసరిగా పాటించాల్సిన సెట్‌బ్యాక్‌లు, రహదారి వెడల్పు, భవన ఎత్తు, పార్కింగ్, అగ్నిమాపక భద్రత తదితర నిబంధ నలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్న రహదారులపై భారీ భవనాలకు అనుమతులు ఇస్తే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు, అగ్నిప్రమాదాల సమయంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

**అనుమతుల వెనుక నిబంధనలు ఏమిటి?..**

20 అడుగుల రహదారి ఉన్న ప్రాంతాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసే సమయంలో పట్టణ ప్రణాళిక అధికారులు ఏ నిబంధనలను పరిగణనలోకి తీసుకున్నారు? సంబంధిత నిబంధనల ప్రకారం రహదారి వెడల్పు, సెట్‌బ్యాక్‌లు, నిర్మాణ విస్తీర్ణం, భవన ఎత్తు తదితర అంశాలను పరిశీలించారా? అనుమతులు మంజూరు చేసే ముందు క్షేత్రస్థాయి పరిశీలన జరిగిందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలాగే అనుమతుల కోసం సమర్పించిన నివేదికల్లో రహదారి వెడల్పు ఎంతగా నమోదు చేశారు? భవనానికి ఎన్ని అంతస్తులకు అనుమతి ఇచ్చారు? సెట్‌బ్యాక్‌లు ఎంతగా చూపించారు? క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులతో అవి సరిపోతున్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు..

**ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?..**

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే వాటిని ప్రారంభ దశలోనే గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుంది. కానీ నిర్మాణం పూర్తయ్యే వరకు అధికారులు పట్టించుకోకపోతే, భవిష్యత్తులో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్న ఇప్పుడు కీలకంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక వాహనాలు, అంబులెన్సులు వెళ్లేందుకు సరిపడా రహదారి లేకపోతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాల్లో నిబంధనల అమలులో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే దాని ప్రభావం నేరుగా ప్రజలపైనే పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..



**భవన నిర్మాణదారులదా బాధ్యత?..**
**అనుమతులు ఇచ్చిన అధికారులదా బాధ్యత?..**
**లేక పర్యవేక్షణలో విఫలమైన వ్యవస్థదా బాధ్యత?..**
**అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు..**
**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి..**

ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో 20 అడుగుల రహదారులపై నిర్మాణంలో ఉన్న, పూర్తయిన బహుళ అంతస్తుల భవనాలపై సమగ్ర పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భవన ప్రణాళికలు, సెట్‌బ్యాక్‌లు, రహదారి వెడల్పు, పార్కింగ్, భద్రతా నిబంధనలు తదితర అంశాలను అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు పుస్తకాల్లో ఉండటమే కాదు.. ప్రజల ప్రాణ భద్రత కోసం క్షేత్రస్థాయిలోనూ అమలు కావాలి. ఇంద్రేశం మున్సిపాలిటీలో బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతుల వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు, మున్సిపల్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు..







## అధికారుల అండతోనే అక్రమ వెంచర్లా?

**- జన్వాడలో అక్రమ లేఅవుట్లపై కొరడా**
**- సీఎంసీ--హెచ్ఎండీఏ సంయుక్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్**
**- అనుమతులు లేని లేఅవుట్ నేలమట్టం**

**గండిపేట, సెప్టెంబరు 9 (ప్రజాకలం):**

జన్వాడ పరిసరాల్లో అనుమతులు లేకుండా వెలుస్తున్న లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. నార్సింగి సర్కిల్--45 పరిధిలోని జన్వాడ గ్రామంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం, హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఓ అక్రమ లేఅవుట్‌ను బుల్డోజర్లతో పూర్తిగా తొలగించారు. లేఅవుట్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు, నిర్మాణ భాగాలను సైతం కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**అధికారుల అండ ఉందా?**

శివారు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు, లేఅవుట్లు వెలుస్తున్నప్పటికీ అవి అధికారుల దృష్టికి రాకుండా ఎలా కొనసాగుతున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా భూములను లేఅవుట్లుగా మార్చి విక్రయాలకు సిద్ధం చేస్తున్న వారిపై మరింత కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ వెంచర్ల వెనుక ఎవరెవరి పాత్ర ఉందో సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు.




**అనుమతులుంటేనే నిర్మాణాలు**

అనుమతులు పొందిన తర్వాతే లేఅవుట్లు, నిర్మాణాలు చేపట్టాలని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజలు, భూ యజమానులు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు ముందుగా సంబంధిత శాఖల అనుమతులను పరిశీలించుకున్న తర్వాతే లావాదేవీలు, నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. జన్వాడతోపాటు నార్సింగి పరిధిలో అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై తనిఖీలు, కూల్చివేతలు నిరంతరం కొనసాగుతాయని టౌన్ ప్లానింగ్, హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పష్టం చేశారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

# రేవంత్ పాలన రాక్షస పాలన!

**- కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష.. - ప్రశ్నిస్తే నిర్బంధమా? ఇదేనా ప్రజాపాలన?**

**- మాదాసు శ్రీనివాస్‌ను పరామర్శించిన: ఎమ్మెల్సీ యాదవ రెడ్డి,బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు**





**గజ్వేల్:09సెప్టెంబర్ (ప్రజా కలం ప్రతినిధి)**

గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్‌లో మంగళవారం జరిగిన ధర్నాలో గాయపడి,అనంతరం పోలీసుల నిర్బంధానికి గురైన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ యాదవ రెడ్డి,గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి బుధవారం అహ్మదిపూర్‌లో పరామర్శించారు.

ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నేతలు మర్కుక్‌లో జరిగిన ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, ఎన్నికల హామీల అమలు,ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,బీఆర్ఎస్ శ్రేణులపై కొనసాగుతున్న అణచివేత వైఖరిపై నేతలు చర్చించారు.ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష గొంతులను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లోకి మరింత బలంగా వెళ్లాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ,ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

**కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష**

కేసీఆర్ నాయకత్వమే తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష అని యాదవ రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సుభిక్షంగా ఉందని, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని వారు విమర్శించారు.ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించారు.ప్రజల తరపున ప్రశ్నించే గొంతులను ఎన్ని నిర్బంధాలు విధించినా తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి,ఎంపీటీసీల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, గజ్వేల్ మండల అధ్యక్షుడు బెండే మధు,మాజీ జడ్పీటీసీ మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి,దయాకర్‌రెడ్డి,గొడుగు స్వామి,మాజీ ఎంపీటీసీ అశోక్,ఆకుల దేవేందర్,నేతలు రమేష్ గౌడ్,మాతపల్లి సర్పంచ్ మహిపాల్,అహ్మద్,రాయవరం సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యల నిరసన

**- బీఆర్ఎస్ నేతల దిష్టిబొమ్మల దహనం**

**- మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి**

మహేశ్వరం, సెప్టెంబర్ 09,(ప్రజా కలం).

మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని జీహెచ్ఎంసీ బడంగ్ పేట్ సర్కిల్‌లో శాసనసభాపతి (స్పీకర్) గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ



నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆందోళనలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, తాత మధు, నవీన్ కుమార్ రెడ్డిల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేశాయి. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి పాల్గొని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న శాసనసభాపతిని కించపరిచేలా బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం వారి అహంకారానికి, దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గౌరవప్రదమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం, అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని, బీఆర్ఎస్ నాయకులు తమ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రజాపాలనను ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి కుట్రపూరిత ఆరోపణలు, దిగజారుడు ధోరణులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పే వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇంట.. నెరవేరిన పేదింటి కల!

**-పేదింటి కలకు 'ఇందిరమ్మ' చేయూత!**

**-లకుడారంలో నూతన గృహప్రవేశం..**

**లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు**

గజ్వేల్ నియోజకవర్గం:09 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన మంజ కల్పన--స్వామి దంపతుల



నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది.నూతన గృహంలోకి అడుగుపెట్టిన దంపతులకు పలువురు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కందూరి అయిలయ్య, ఉమ్మడి కొండపాక మండల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై నూతన గృహ యజమానులను అభినందించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తూ, సొంతింటి కలను సాకారం చేస్తున్న సంక్షేమ పథకంగా నిలుస్తోందని అన్నారు.అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కంకణాల మల్లేశం, పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహచారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ గుప్తా, మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు కోట శ్రీనివాస్,మల్లం యాదగిరి,గుర్రం ఎల్లం, బూర్గు యాదగిరి,బీఎల్ఏలు ముద్దపురం రాజు,మారపాక శివకుమార్,బచ్చలి బాబు,కనుగుల చంద్రం తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలుకు ఉద్యోగుల సమరశంఖం

**-'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి**

**గజ్వేల్ ఉద్యోగుల జేఏసీ పిలుపు**




**గజ్వేల్:09సెప్టెంబర్ ( ప్రజా కలం ప్రతినిధి)**

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టిఈ జెఎసి టిఈ జెఎసి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గజ్వేల్ ఉద్యోగుల జేఏసీ పిలుపునిచ్చింది.ఈ సందర్భంగా గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో 'చలో హైదరాబాద్'కు సంబంధించిన కార్యాచరణ, ఉద్యోగుల భాగస్వామ్యం, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం 'చలో హైదరాబాద్' పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఉద్యోగుల సమస్యలపై చర్చించిన నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల న్యాయమైన హక్కులు, సంక్షేమం కోసం ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు :

పి ఆర్ సి ను వెంటనే అమలు చేయాలి,పెండింగ్‌లో ఉన్న 6 డిఏ లను తక్షణమే విడుదల చేయాలి,సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ ను అమలు చేయాలి,ఈహెచ్ఎస్ ను సమర్థవంతంగా అమలు చేయాలి,317 జీవో కు సంబంధించిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి, ఉద్యోగులకు సంబంధించిన ఇతర పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి. హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని గజ్వేల్ ఉద్యోగుల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ టీఎన్జీవో అధ్యక్షులు ఎస్.రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్,కోశాధికారి భరత్,టీఎన్జీవో సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్,సిద్దిపేట కలెక్టరేట్ యూనిట్ ఉపాధ్యక్షులు మధుకర్,టీఎన్జీవో జాయింట్ సెక్రటరీ జె.ఎస్.సతీష్ కుమార్,ఆర్గనైజింగ్ సెక్రటరీ అర్.భానుకుమార్, ఆసుపత్రి ఉద్యోగులు,తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల కొరతతో గ్రామాభివృద్ధికి ఆటంకాలు.

**- సమన్వయంతోనే మండల ప్రగతి సాధ్యం.**

**మండల ప్రత్యేక అధికారి ఏడిఏ బాబు నాయక్.**

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 09.

అధికారులు, సర్పంచులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు గ్రామస్థాయికి చేరడంతో పాటు ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని మండల ప్రత్యేక అధికారి, గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్




అన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంతో సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తామని చెప్పి బయటకు వెళ్లారు. అధికారులు చొరవ తీసుకుని ఇకపై అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సర్పంచులు తిరిగి సమావేశానికి హాజరయ్యారు. సర్వసభ్య సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు పరిష్కారం కావడం లేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకానికి సంబంధించి అధికారుల కొరతతో గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మండల కేంద్రం నుంచి సిద్దిపేట జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎన్నోసార్లు కోరినా పరిష్కారం కావడం లేదని సర్పంచులు పేర్కొన్నారు. వడ్డేపల్లి, రాంసాగర్, లింగారెడ్డిపల్లి గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలను పరిష్కరించాలని, వర్షాకాలంలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏఓ నరేష్, ఆయా శాఖల మండలస్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# దళితులను అవమానిస్తే ఖబడ్దార్.. చర్యలు తప్పవు!

**- శుద్ధీకరణ పేరుతో అవమానిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: భట్టి విక్రమార్క**

**- కెసిఆర్ ఫామ్‌హౌస్ ఘటనపై కాంగ్రెస్ నేతల ఫిర్యాదు..**

**- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్**

హైదరాబాద్:09 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

దళితులను అవమానించే చర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.మానకొండూర్ ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ నాయకులు బుధవారం అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసి కెసిఆర్ ఫామ్‌హౌస్ వద్ద మంగళవారం చోటుచేసుకున్న ఘటనపై వివరించారు.దళితులు అడుగుపెట్టిన ప్రాంతాన్ని పసుపు నీటితో శుద్ధి చేశారంటూ వచ్చిన ఆరోపణలపై నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఇలాంటి చర్యలు దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయని ఆరోపించారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా దళితులను చిన్నచూపు చూసే ఘటనలు చోటుచేసుకోవడం సిగ్గుచేటని అన్నారు.దళితులను అవమానించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.



"ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్ కొమ్ము విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు (ఎన్ఆర్ఐ) గాడిపల్లి రఘువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్ కొమ్ము విజయ్‌కుమార్,సిద్దిపేట జిల్లా చైర్మన్ తప్పెట శంకర్,నంగునూర్ మండల చైర్మన్ రాగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిరోజూ రాత్రి 9 గంటలకు కరెంట్ కట్

**చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర అవస్థలు – ప్రజా ప్రతినిధుల మౌనం**

దేవీపట్నం: దేవీపట్నం మండలంలో గత కొంత కాలంగా విద్యుత్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ప్రతిరోజూ రాత్రి సరిగ్గా 9 గంటల సమయంలో కరెంట్ పోతోంది. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో కరెంటు పోవడంతో చిన్న పిల్లలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చీకటిలో పసిపిల్లలు భయంతో ఏడుస్తుండగా, వృద్ధులు ఉక్కపోతతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల చదువులకు కూడా ఆటంకం కలుగుతోంది.

# వంట గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు

హైదరాబాద్ : వంటగ్యాస్ బుకింగ్ గడువును తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది గ్రామీణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్ గడువును 45 రోజుల నుంచి 25 రోజులకు తగ్గిస్తున్నట్లు కేంద్రమంత్రి సురేశ్ గోపీ వెల్లడించారు. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఎల్పీజీ సరఫరాపై పడిన ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని గతంలో దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సిలిండర్ బుకింగ్ నిబంధనల్లో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పు చేసింది. ఆ మార్పుల ప్రకారం రీఫిల్ బుకింగ్ మధ్య గడువు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులుగా నిర్ణయించారు.

# సర్పంచ్ ఎన్నికల వేడి

**19 పంచాయతీల్లో ఆసక్తికర చర్చ**

**ప్రజల వద్దకు వెళ్లే నాయకత్వమా.. కొత్త తరానికి అవకాశమా..**

రాజవొమ్మంగి: పంచాయతీ ఎన్నికలపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో రాజవొమ్మంగి మండలంలోని 19 పంచాయతీల్లో సర్పంచ్ పదవులపై చర్చ మొదలైంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి అధికారిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాతే అభ్యర్థులు, పోటీ స్వరూపం, స్థానిక పరిస్థితులు స్పష్టమయ్యే అవకాశం ఉన్నప్పటికీ గ్రామాల్లో మాత్రం సర్పంచ్‌గా ఎలాంటి నాయకత్వం కావాలన్న అంశంపై ఆసక్తి నెలకొంటోంది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు గడపగడపకు వెళ్లే నాయకత్వమా. లేక సమస్యల పరిష్కారం కోసం ప్రజలే నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండే నాయకత్వమా అన్నది రాబోయే ఎన్నికల్లో కీలకమైన ప్రశ్నగా మారనుంది. గ్రామంలోనే ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకోవడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పరిష్కారం కోసం కృషి చేయడం, గ్రామాభివృద్ధిపై నిరంతరం దృష్టి పెట్టడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు గతంలో గ్రామానికి సేవ చేసిన నాయకత్వానికి మరోసారి అవకాశం కల్పిస్తారా. లేక కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చే కొత్త తరానికి అవకాశం ఇస్తారా అన్నది కూడా ఆయా పంచాయతీల ప్రజల నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఎవరి గెలుపును అంచనా వేయడం కానీ, ఎవరి బలాబలాలను నిర్ణయించడం కానీ సాధ్యం కాదు.